
సహజీవన భావనల పావురాయి
# గీటురాయి
వారపత్రిక 8-1-2021 ₹15/-

2020

# కలలేమయ్యాయి



## ఉజ్వల తారలు

## గ్రంథం ఆవిష్కరణ

గీటురాయి
వారపత్రిక
GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in

సంపుటి 43 సంచిక: 2 హైదరాబాద్
శుక్రవారం 8 జనవరి 2021 రూ.15-00
23 జమాదల్ అవ్వల్ 1442 హిజ్రీ

**తొలిగీటు**

**సిగ్గు వల్ల మేలే జరుగుతుంది. సిగ్గు పూర్తిగా ప్రయోజనదాయకమే.**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**
**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**
**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**
**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**
గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**
సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**
సేల్స్ మేనేజర్
**ముహమ్మద్ యాసీన్, 9700255736**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com




**బంధాలు.. అనుబంధాలు...**

## లోపల...

| | |
|---|---|
| ముస్లిం మహిళలు ...... | 04 |
| 2020 కలలేమయ్యాయి? ...... | 05 |
| రూ.10 నాణేలు చెల్లవా? ...... | 08 |
| విశ్వాసుల మాత సయ్యిదా ఆయిషా (ర.అ) – 28 ...... | 10 |
| చరితార్థులు – ముఫ్తి కిఫాయతుల్లా ...... | 13 |
| 'ఉజ్వల తారలు' గ్రంథం ఆవిష్కరణ ...... | 16 |
| భలే మంచి టైమ్ ...... | 17 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) ...... | 18 |
| అడుగుజాడలు ...... | 19 |
| అజ్ఞానం – విజ్ఞానం ...... | 20 |
| అంతర్జాతీయ బానిసత్వ నిర్మూలనా దినోత్సవం సార్థకమేనా ..... | 22 |
| నైతిక విలువలను పాఠ్యాంశాలుగా బోధించాలి ...... | 25 |
| కరోనా వ్యాక్సిన్ – ప్రస్తుత పరిస్థితులు ...... | 26 |
| చేసిన పుణ్యం తిరిగొచ్చింది ...... | 29 |
| రుచుల వెంట పడకండి ...... | 30 |
| యువశక్తి నిర్వీర్యం ...... | 31 |
| సంక్షిప్త భారతం ...... | 32 |
| సర్వత్రా ...... | 33 |
| పరవశించిపోయిన సైంటిస్ట్ ...... | 34 |

**ముగిసిన షూటింగ్ .!**




ముగిసిందా తలైవా
రాజకీయ షూటింగు
రంగేసుకోని పడుకో
ఇంకెందుకు మీటింగు!
ఆధ్యాత్మిక రాజకీయ
తత్వం తెలిసొచ్చిందా
కమండలం చేతపట్టి
కలలో నడిచొచ్చిందా!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

ఆలోచన

# ముస్లిం మహిళలు

**ఇటీవల** వచ్చిన కొన్ని వార్తలు ముఖ్యంగా ముస్లిం మహిళల గురించి వచ్చిన వార్తలు గమనించదగ్గవి. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న రైతులకు మద్దతుగా ముస్లిం మహిళలు గొంతు విప్పారు. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమించిన షాహీన్‌బాగ్ మహిళలు బీహారు గయలోని శాంతి బాగ్ ముస్లిం మహిళలకు స్ఫూర్తినిచ్చారు. గయలో కూడా శాంతిబాగ్ నిరసన శిబిరం చాలా కాలం కొనసాగింది. కరోనా తర్వాత ఈ నిరసనలు ఆగిపోయాయి. ఇప్పుడు మళ్ళీ శాంతిబాగ్ నిరసన శిబిరం రైతు ఉద్యమానికి మద్దతుగా ప్రారంభమయ్యింది. ఈ నిరసన శిబిరంలోను ముందంజలో ఉన్నది ముస్లిం మహిళలే. సంవిధాన్ బచావ్ మోర్చా పేరుతో ఈ ఉద్యమం ప్రారంభమయ్యింది. రైతులకు మద్దతుగా వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ, పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమించారు. పౌరసత్వ సవరణ చట్టం, వ్యవసాయచట్టాలను రద్దు చేయాలంటూ ప్లాకార్డులతో ప్రదర్శన ప్రారంభించారు.

పౌరసత్వ సవరణ చట్టం మాదిరిగానే ఇప్పుడు కొత్తగా చేసిన మూడు వ్యవసాయ చట్టాలు కూడా అప్రజాస్వామికమైనవనీ వాటిని వెంటనే రద్దు చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై ఒక మెమొరాండం కూడా ప్రధానికి సమర్పించారు. శాంతిబాగ్ నుంచి ఢిల్లీలోని తిక్రీ బోర్డర్ వరకు మార్చ్ నిర్వహించే కార్యక్రమం కూడా చేపడుతున్నారు. ఈ మోర్చాకు కో కన్వినర్‌గా ఉన్న సతీష్ దాస్ మాట్లాడుతూ పౌరసత్వ సవరణ చట్టాన్ని ప్రభుత్వం ఇంకా ఉపసంహరించలేదని, ఆ విషయాన్ని ప్రభుత్వానికి గుర్తు చేస్తున్నామని చెప్పారు. పౌరసత్వ సవరణ చట్టం, ఎన్నార్సీ, ఎన్పార్పీలకు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని, ఇది ఆగిపోలేదని అన్నారు. అలాగే వ్యవసాయ చట్టాలను కూడా వెంటనే రద్దు చేయకపోతే మోర్చా తరపున నిరవధిక నిరసన కొనసాగిస్తామని చెప్పారు. షాహీన్ బాగ్ నిరసనల్లో కూడా చురుకుగా పాల్గొన్న షబానా మాట్లాడుతూ ఈ అప్రజాస్వామిక చట్టాలకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించే ప్రతిజ్ఞ అందరూ చేశామన్నారు.

ఇటీవల వచ్చిన మరో ముఖ్యమైన వార్త ముస్లిం మహిళలకు సంబంధించిన వార్త ఏమంటే, ఉత్తరాఖండ్, హరిద్వార్ సమీపంలోని గ్రామాలకు చెందిన ముగ్గురు ముస్లిం మహిళలు జుడిషియల్ సర్వీసెస్ పరీక్షల్లో పాసయ్యారు. సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ నియామకాలకు జరిగిన పరీక్షలివి. 2019లో ఈ పరీక్షలకు హాజరైన 17 మందిలో నలుగురు ముస్లిం మహిళలు కూడా ఉన్నారు. వారిలో ముగ్గురు ఎంపికయ్యారు. గతంలో రాజస్థాన్‌లో 18 మంది ముస్లిం మహిళలు ఇవే పరీక్షల్లో ఉత్తీర్ణులై న్యాయమూర్తులయ్యారు. ఉత్తరప్రదేశ్‌లో కూడా 5 గురు ఎంపికయ్యారు.

రూర్కీకి చెందిన పర్వీన్ కుటుంబంలో ఇంతకు ముందు న్యాయశాస్త్రం చదివిన వారెవ్వరు లేరు. ఆమె ఇప్పుడు న్యాయమూర్తి అయ్యారు. అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. అలాగే ఒక రైతు కుటుంబానికి చెందిన షహాదత్ హుస్సేన్ కూడా న్యాయమూర్తిగా ఎంపికయ్యారు. తనకు కుటుంబం నుంచి పూర్తి సహకారం లభించిందని, తాను చదవాలనుకున్న చదువులు చదివే స్వేచ్ఛ ఇచ్చారని ఆమె అన్నారు.

మరో వార్త, ఇది కూడా ముస్లిం మహిళలకు సంబంధించిందే, ఢిల్లీకి చెందిన జామియా నగర్లోని 23 మంది ముస్లిం బాలికలు మెడికల్ ఎంట్రెన్స్ పరీక్ష నీట్‌లో క్వాలిఫై అయ్యారు. వీరంతా పేద కుటుంబాలకు చెందినవారే. ప్రభుత్వ స్కూళ్ళలో చదివినవారు. ఇందులో కేవలం ఒకే ఒక్క అమ్మాయి మాత్రం మెడికల్ కాలేజీలో చేరగలిగింది. ఎందుకంటే, నీట్ లో క్వాలిఫై అయినప్పటికీ ప్రభుత్వ కళాశాలలో సీటు సాధించే స్థాయి ర్యాంకు రాలేదు. ప్రయివేటు కళాశాలలో వారికి సీటు దొరికే అవకాశం ఉన్నప్పటికీ విపరీతమైన ఫీజులు కట్టే స్థోమత వారికి లేదు. పైగా ఈ అమ్మాయిలంతా ఎలాంటి ప్రత్యేక ట్యూషన్లు లేకుండా స్వంత పరిశ్రమతో పరీక్షలు రాశారు. ఢిల్లీ డిప్యూటీ చీఫ్ మినిస్టర్ మనీష్ సిసోదియా కూడా ప్రభుత్వ స్కూళ్ళ గురించి మాట్లాడుతూ నూర్ నగర్ స్కూలు పిల్లలు నీట్ పరీక్షల్లో గొప్ప ప్రతిభ చూపించారని అన్నారు. ఈ అమ్మాయిలంతా మరోసారి నీట్ పరీక్ష రాసి ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సంపాదించడానికి నడుం కట్టారు.

ఈ వార్తలు కొత్త ఉత్సాహాన్నిస్తున్నాయి. ముస్లిం మహిళల గురించి ప్రచారంలో ఉన్న అపార్థాలు, అపోహలను పటాపంచలు చేస్తున్నాయి. ముస్లిం బాలికలు తమ స్వశక్తితో, వనరుల లేమి ఉన్నప్పటికీ ఎలా విజయాలు సాధించే ఉత్సాహాన్ని చూపిస్తున్నారో, ఎలా సామాజిక చైతన్యం ప్రదర్శిస్తున్నారో, పోరాటాల్లో ఎలా ముందంజ వేస్తున్నారో రుజువు చేసే వార్తలివి. ❖

 అబ్దుల్ వాహెద్




**విజన్ 2020** అనే మాట చాలా సార్లు మనం విన్నాం. మాజీ రాష్ట్రపతి, మిస్సయిల్ మ్యాన్‌గా పేరుపొందిన భారత రత్న ఏ.పి.జే. అబ్దుల్ కలాం ఇండియా 2020 పేరుతో ఒక పుస్తకం కూడా రాశారు. ఈ పుస్తకం రాసింది 1998లో. భారత ఆర్థిక వ్యవస్థ రెక్కలు విప్పుకుని పైకెగరడానికి సమాయత్త మవుతున్నప్పుడు ఆయన రాసిన పుస్తకం ఇండియా 2020. కొత్త ఆశలు, కొత్త గమ్యాలు, కొత్త కలలు, కొత్త లక్ష్యాల కొత్త భారతదేశాన్ని కలగన్నారాయన.

2020 వచ్చింది, వెళ్ళిపోయింది. చేదు జ్ఞాపకాలను మాత్రం మిగిల్చింది. విజన్ 2020 లేదా ఇండియా 2020 వైపు ఒకసారి వెనుదిరిగి చూస్తే, ముఖ్యంగా ఆర్థిక వ్యవస్థను పరిశీలిస్తే ఇప్పుడెలా అనిపిస్తోంది.

ఇప్పుడు మనకు ఆత్మనిర్భర్ భారత్ అనే మాట చాలా బలంగా వినిపిస్తోంది. మరోవైపు మనకు ప్రజాస్వామ్యం చాలా ఎక్కువైపోయిందని నీతిఆయోగ్ అధిపతి అన్నారు. దానిపై కొంత గగ్గోలు కూడా జరిగింది. ఆయన చెప్పిన ఈ మాటనే చాలా మంది పట్టించుకున్నారు కానీ ఆయన చెప్పిన మరికొన్ని మాటలను ఎవరూ పట్టించుకోలేదు. ఆయన ఏమన్నారంటే, భారతదేశ చరిత్రలో మొదటిసారి ప్రభుత్వం చాలా పెద్దస్థాయిలో ఆలోచిస్తోంది. గ్లోబల్ ఛాంపియన్లను తయారు చేయాలనుకుంటోంది అన్నారు. అంటే కేవలం నాలుగో ఐదో కార్పోరేట్ దిగ్గజాలకు పూర్తి సహకారం

అందించి ప్రపంచస్థాయిలో పోటీపడేలా తయారు చేయాలని అనుకుంటున్నారు తప్ప అందరికీ అవకాశాలు ఇవ్వాలని అనుకోవడం లేదు. అంటే, చిన్నా చితకా కంపెనీలు, వ్యాపారాలు లక్షలాది దేశంలో ఉండడం కన్నా, కేవలం మూడో నాలుగో భారీ కార్పోరేట్ కంపెనీలు ఉండాలని భావిస్తోంది.

ఇండియా 2020, విజన్ 2020 నినాదాలు ఇప్పుడు చాలా గుర్తొస్తున్నాయి. ఎందుకంటే కొత్త భారతం ఇప్పుడు రూపు దిద్దుకుంటోంది. కొత్త భారతానికి 2016 నుంచి పునాదులు పడ్డాయి. ఆర్థిక వ్యవస్థనుంచి ఒక్కసారిగా నగదును మాయం చేశారు. నోట్లరద్దుతో క్యాష్ లావాదేవీలు ఒక్కసారిగా నిలిచిపోయాయి. చిన్న చితక వ్యాపారాలు కొన్ని నెలల పాటు లావాదేవీలు చేయలేకపోయాయి. ఫలితంగా చాలా వ్యాపారాలు మూతపడ్డాయి. కాని భారీ కార్పోరేట్లకు ఇది సమస్య కాదు. ఎందుకంటే వారంతా ఎలక్ట్రానిక్ లావాదేవీలు జరపగలరు. నోట్లరద్దు వల్ల మధ్యతరగతి, పేద ప్రజలు మాత్రమే ఇక్కట్ల పాలయ్యారు. సంపన్నులు క్రెడిట్, డెబిట్ కార్డులతో, ఇంటర్నెట్ బ్యాంకింగుతో ఎలాంటి ఇబ్బంది లేకుండా గడిపేశారు. ఇదే పరిస్థితి వ్యాపారాల్లోను చూడవచ్చు. పెద్ద పెద్ద భారీ వ్యాపార సామ్రాజ్యాలకు నోట్లరద్దు వల్ల ఎలాంటి సమస్యా రాలేదు. చిన్న చితక వ్యాపారాలు మూతపడ్డాయి.

ఆ తర్వాత జియస్టీ తీసుకువచ్చారు. ఇది అత్యంత సంక్లిష్టంగా, ఒక చిక్కుముడిలా చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి పెద్ద సమస్యలా వచ్చింది. పెద్దపెద్ద వ్యాపార సామ్రాజ్యాలకు ఇది సమస్య కాదు. ఎందుకంటే టాక్సు వ్యవహారాలు చూడ్డానికి వారి వద్ద టీములు పనిచేస్తుంటాయి. ఫలితంగా చిన్న చితక పరిశ్రమలు, వ్యాపారాలు నెమ్మదిగా అదృశ్యం కావడం ప్రారంభమయ్యింది.

2020 వచ్చిన తర్వాత కరోనా కూడా వచ్చింది. కరోనా రావడం ఆర్థికవ్యవస్థకు మంచి చేసిందా లేదా అనే చర్చ కన్నా ముఖ్యమైన చర్చ కరోనా తర్వాత భారీ కార్పోరేట్ సామ్రాజ్యాలకు మంచి జరిగిందా లేదా అన్నది. కరోనాను కట్టడి చేయడానికి లాక్‌డౌన్ పెట్టారు. లాక్‌డౌన్ దెబ్బతో సగటు ప్రజలు విలవిలలాడారు. వ్యాపారాలన్నీ మూతపడ్డాయి. కాని భారీ కార్పోరేట్లకు ఇది సమస్య కాదు. వర్క్ ఫ్రం హోం ద్వారా సిబ్బందితో పనిచేయించే సామర్థ్యం వారికి ఉంది. అలాగే ఈ కుదుపులను తట్టుకునే ఆర్థిక స్థోమత వారికి ఉంది. కాని చిన్న వ్యాపారాల పరిస్థితి ఏమిటి? అవన్నీ కనుమరుగయ్యాయి. వలస కార్మికుల బతుకులు ఛిద్రమయ్యాయి. కాని ఇవేవీ పట్టించుకునే పరిస్థితి లేకుండా కరోనా జిహాద్ అనే ప్రచారం మొదలయ్యింది. మరోవైపు ఏం జరిగిందంటే... ప్రముఖ పత్రిక ఎకనమిస్ట్ ప్రకారం ముఖేష్ అంబానీ సంపద 2016 తర్వాత 350 శాతం పెరిగింది. గౌతం అదానీ సంపద 750 శాతం పెరిగింది. మరోవైపు భారత ఆర్థికవ్యవస్థ పతనం వైపు పరుగులు పెడుతోంది. డిసెంబరు 2020 నాటికి వరుసగా 36 నెలలుగా భారత ఆర్థిక వ్యవస్థ పతనంలో జారి పోవడం కొనసాగుతూనే ఉంది.

ప్రధాని మోడీకి మాజీ సలహాదారుడు అరవింద్ పంగారియా ప్రకారం ఆత్మనిర్భర్ భారత్ అనేది కేవలం దిగుమతులపై టారిఫులు పెంచే కార్యక్రమం తప్ప మరేమీ కాదు. అంటే దిగుమతులపై సుంకాలు పెంచడం వల్ల ఇక్కడి కంపెనీలు విదేశీ వస్తువుల కన్నా తక్కువ ధరకు అమ్ముకునే అవకాశం కల్పించడం. అంటే ఆత్మనిర్భర్ అనేది ప్రజలకు, వినియోగదారులకు వర్తించేది కాదు, ఇక్కడి బడా పారిశ్రామికవేత్తలకు వర్తించేది మాత్రమే.

విజన్ 2020 లేదా ఇండియా 2020 ఎలా కనిపిస్తోంది? డిసెంబరు నెలలో వరుసగా వచ్చిన కొన్ని వార్తలను చూద్దాం. ముఖ్యంగా మన ప్రాధాన్యతలు, ప్రాముఖ్యతలు ఎలా ఉన్నాయో తెలుసుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. దేశంలో బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లవ్ జిహాద్ అదుపు చేయడానికి చట్టాలు చేశారు. అసలు లవ్ జిహాద్ ఉందా? ప్రభుత్వ అధికారిక సమాచారం ప్రకారం ఎన్ని కేసులున్నాయి? ఇలాంటి వివరాలేవీ ప్రభుత్వం వద్ద కూడా లేవు. కాని వరుసగా బీజేపీ పాలిత రాష్ట్రాలు చట్టాలు చేశాయి.

మాజీ సివిల్ సర్వెంట్స్ వంద మందికన్నా ఎక్కువ మంది ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్‌కు ఒక లేఖ రాసి లవ్ జిహాద్ ఆర్డినెన్సు వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈ ఆర్డినెన్సు ముస్లిం యువకులను వేధించడానికి, అలాగే హిందూ అమ్మాయిలు మతాంతర వివాహాలు చేసుకునే ధైర్యం చేయకుండా అరికట్టడానికి ఉద్దేశించిందని అన్నారు. ఈ చట్టం చేసిన తర్వాతి నుంచి ఉత్తరప్రదేశ్ లో వరుసగా అరెస్టులు మొదలయ్యాయి. ఉత్తరప్రదేశ్ విద్వేష రాజకీయాలకు వేదికగా మారిందని కూడా వారు విమర్శించారు. మాజీ జాతీయ భద్రతా సలహాదారుడు శివశంకర్ మీనన్, మాజీ ఫారిన్ సెక్రటరీ నిరుపమరావు తదితర ప్రముఖులు ఈ లేఖ రాసిన వారిలో ఉన్నారు. మురాదాబాద్‌లో మతాంతర వివాహం చేసుకున్న ఒక జంటలో ముస్లిం భర్తను పోలీ

సులు అరెస్టు చేశారు. హిందూ భార్యను ప్రొటెక్షన్ హోంకు తరలించారు. అక్కడ ఆమెకు గర్భస్రావం అయ్యింది. భజరంగ్ దళ్ ఈ అరెస్టుల్లో చాలా చురుకుగా పోలీసులతో పాటు పనిచేసిందని తెలుస్తోంది. భజరంగదళ్ తదితర సంస్థలే ఇంటరాగేషన్లు కూడా చేస్తున్నాయని ఈ లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి మరో కేసులో అలహాబాద్ హైకోర్టు మతాంతర వివాహం చేసుకున్న హిందూ అమ్మాయి తన ముస్లిం భర్తతో కలిసి ఉండే హక్కును ఎవరూ కాదనలేరని కేసు కొట్టేసింది. కలకత్తా హైకోర్టు కూడా ఇలాంటి తీర్పునే ఇచ్చింది. మతాంతర వివాహాలను లక్ష్యంగా చేసుకుని, లవ్ జిహాద్ చట్టం చేశారని జనతాదళ్ యునైటెడ్ అంటే బీజేపీ మిత్రపక్షం నాయకుడు కేసీ త్యాగీ విమర్శించారు. లవ్ జిహాద్ పేరుతో దేశంలో విద్వేష వాతావరణాన్ని పెంచుతున్నారని అన్నారు. ఉత్తరప్రదేశ్ బిజ్నూర్ జిల్లాలో ఒక పుట్టినరోజు పార్టీలో పాల్గొన్న ముస్లిం కుర్రాడు, తన క్లాస్ మేట్ అయిన హిందూ అమ్మాయితో కలిసి మాట్లాడుతూ ఇంటికి నడిచి వెళుతున్నాడు. వారిద్దరిని కొందరు మతోన్మాదులు పట్టుకుని కొట్టి పోలీసు స్టేషనుకు లాక్కెళ్ళారు. ఆ ముస్లిం కుర్రాడిపై లవ్ జిహాద్ కేసు పెట్టారు. ఆ అమ్మాయి తండ్రితో కూడా కేసు పెట్టించారు. తర్వాత ఆ అమ్మాయి తండ్రి పోలీసులు బలవంతంగా తనతో కేసు పెట్టించారని చెప్పాడు. మరో సంఘటనలో లవ్ జిహాద్ చట్టం క్రింద ఒక ముస్లిం యువకుడి కుటుంబసభ్యులు 14 మందిని అరెస్టు చేశారు.

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి మదన్ లోకూర్ ఈ చట్టాన్ని తీవ్రంగా విమర్శించారు. చట్టంలో చాలా లోపాలున్నాయని అన్నారు. చట్టం రాజ్యాంగబద్ధంగా ఉందా లేదా అన్నది చూసుకోవాలని సలహా ఇచ్చారు. ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఏ.పి.షా ఈ చట్టాన్ని విమర్శిస్తూ ఉత్తరప్రదేశ్ చేసిన ఈ చట్టం ఖాప్ పంచాయతీలా ఉందని అన్నారు. వెంటనే రద్దు చేయాలని చెప్పారు.

ఒకవైపు లవ్ జిహాద్ చట్టం వార్తలు ప్రముఖంగా కనిపిస్తున్నాయి. మరోవైపు యూనిఫాం సివిల్ కోడ్ తీసుకురావాలంటూ బీజేపీ నేతలు మరోసారి నినాదాలివ్వడం ప్రారంభమయ్యింది. 1990 వరకు మహిళా సంఘాలు కూడా యూనిఫాం సివిల్ కోడ్ తీసుకురావాలని కోరేవి. కాని ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు, యూనిఫాం సివిల్ కోడ్ పేరుతో జరుగుతున్న రాజకీయాలను గమనించిన తర్వాత చాలా మహిళా సంఘాలు ఇప్పుడు యూనిఫాం సివిల్ కోడ్ విషయంలో ధోరణిని మార్చుకున్నాయి.

ఈ పరిణామాలన్నీ గమనిస్తే ఏమనిపిస్తోంది. విజన్ 2020, ఇండియా 2020 గురించి 1998లో ఆలోచనలు 2020 వచ్చి వెళ్ళిపోయిన తర్వాత పరిస్థితులను బేరీజు వేసుకుంటే ఏమి అర్థమవుతోంది? కేవలం బడా కార్పొరేట్లకు మాత్రమే ప్రయోజనకరమైన పనులే ప్రభుత్వాలు చేస్తున్నాయనిపించడం లేదా? కొత్త వ్యవసాయచట్టాలపై రైతుల నిరసనలను కూడా పట్టించుకోకుండా కార్పొరేట్ల కోసం పనిచేయడమే ప్రధానంగా వ్యవహరిస్తున్నాయని తెలియడంలేదా? ఈ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి కరోనా జిహాద్, లవ్ జిహాద్, పేరుతో ప్రజల్లో చిచ్చుపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నది అర్థం కావడం లేదా? ❖




## గీటురాయి వార పత్రిక ధర పెంపు

గీటురాయి వారపత్రిక చందా ధరను రూ.15లకు పెంచనున్నాము. **2021 జనవరి 1వ తేదీ సంచిక** నుంచి ఈ ధర అమలులోకి వస్తుంది. న్యూస్ ప్రింటు, ప్రింటింగ్ సామగ్రి రేట్లు విపరీతంగా పెరిగిన కారణంగా ముద్రణా వ్యయం భారంగా మారింది. ఈ నేపథ్యంలో పత్రిక ధరను పెంచక తప్పడంలేదు. పాఠకులు, ఏజెంట్లు సహృదయంతో అర్థం చేసుకుంటారని, ఎప్పటిలాగే పత్రికను ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

| | |
|---|---|
| **విడి ప్రతి** | **రూ. 15** |
| **ఆరు నెలల చందా** | **రూ. 375-00** |
| **సంవత్సర చందా** | **రూ. 750-00** |

**- ఎడిటర్**

**యండి. ఉస్మాన్ ఖాన్**




# రూ. 10 నాణేలు చెల్లవా?

## నాణేల అనధికార నిషేధానికి బ్యాంకు అధికారులే కారణం

**రూ. 10 నాణేలపై** ఎటువంటి నిషేధం లేనప్పటికీ బ్యాంకులు నాణేలు తీసుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పది నాణేలు చెలామణిలో ఉన్నాయని, వాటిపై ఎలాంటి నిషేధం లేదని రిజర్వు బ్యాంకు పదే పదే ప్రకటించినప్పటికీ బ్యాంకు సిబ్బంది మొండితనం, బద్ధకం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్యాంకులే తీసుకోకపోవడం వల్ల బయట వ్యాపారులెవరూ పది నాణే లను తీసుకోవడం లేదు. దీంతో పది నాణేల అనధికార నిషేధం కొనసాగుతోంది.

మోడీ సర్కారు రూ. 500, రూ. 1000 నోట్లను రద్దు చేసిన తర్వాత సామాన్య ప్రజలకు ఇదో పెద్ద చిక్కు సమస్యగా మారింది. పెద్దనోట్ల రద్దుతో నగదు నిల్వలకు కొరత ఏర్పడడం, ఉపాధి హామీ కూలీలు, పింఛన్ దారుల చెల్లింపులకు సంబంధించి పది రూపాయల నాణేలు ఇవ్వడం ప్రారంభించారు. ఎక్కువ మొత్తంలో నాణేలు మార్కెట్‌లోకి రావడంతో కొంతమంది వాటిని బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకోవాలని భావించారు. పెద్ద మొత్తంలో నాణేలు బ్యాంకులకు రావడంతో, బ్యాంకు సిబ్బంది నాణేలను లెక్కించి తీసుకోవడానికి ఎక్కువ సమయం పడుతుందని కొన్ని బ్యాంకులు వాటిని తీసుకోడానికి నిరాకరించాయి. అప్పటి నుంచి నాణేలు చెల్లవనే వదంతి మొదలైంది. అది అలా వ్యాపించి చిరు వ్యాపారులు సైతం తీసుకోవడం మానేశారు. ఈ రోజు మార్కెట్లో పది నాణేలు ఎవరూ తీసుకోకపోడానికి ప్రధాన కారణం బ్యాంకు అధికారులే. ఇప్పటికీ చాలాచోట్ల బ్యాంకు అధికారుల వైఖరిలో మార్పు లేదు. 10 రూపాయల నాణేలు చెల్లవంటూ బ్యాంకులూ, వ్యాపారులు తిరస్కరించడంతో ప్రజలకు ఏం చేయాలో తెలియని అయోమయ పరిస్థితి తలెత్తింది. ప్రజల్లో రూ.10 నాణాలపై అనేక భయాలు, అపోహలు ఉన్నాయి. నకిలీ నాణేలు వస్తున్నాయని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. కొత్తవి, పాతవి కలిపి అనేక రూపాల్లో రూ.10 నాణేలు ఉండడంతో కొందరు గందరగోళానికి గురవుతున్నారని కొంతమంది వ్యాపారులు చెబుతున్నారు. నాణెం మీద లైన్ల సంఖ్యను చూసి కూడా కొందరు వాటిని తీసుకోవడం లేదని, ఆటో డ్రైవర్లు, టీ కొట్ల దగ్గర ఇలాంటి సమస్యలు తరచూ ఎదురవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. నిజానికి 'పది' నాణాలపై ఎటువంటి నిషేధం లేదని, పాతవి, కొత్తవి.. అవి ఏ రూపంలో ఉన్నా చెల్లుతాయని ఆర్‌బీఐ ప్రకటించింది. పుకార్లను నమ్మవద్దని విజ్ఞప్తి చేసింది. అన్ని రకాల రూ.10 నాణేలూ చెల్లుతాయని, అపోహలుంటే 14440 టోల్ ఫ్రీ నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని కూడా ప్రజలకు సూచించింది. ప్రజల్లో నెలకొన్న అనుమానాలు, అపోహలను దూరం చేయడానికి, సరైన అవగాహన కల్పించడానికి ఆర్‌బీఐ కొంతమేర ప్రయ

**కొంతమంది బ్యాంకు అధికారులే మేము తీసుకోవడం లేదు. మరెక్కడైనా మార్చుకోండి అంటే, ప్రజలు ఎక్కడికి పోవాలి.. ఎవరు తీసుకుంటారు? సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి, బాధ్యతతో వ్యవహరిస్తూ, రూ. 'పది' నాణేల సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది.**

త్నాలు చేసింది. కొంతకాలం పాటు మొబైల్ ఫోన్లకు సందేశాలు కూడా పంపింది. కాని ఆ సందేశం ప్రజలకు చేరడంలో అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. సందేహాలను నివృత్తి చేయలేకపోయింది. అయితే సామాన్య ప్రజలకు ఈ ఫోన్లు చెయ్యడాలు, మెసేజులు చదవడాలు, బదులివ్వడాలు, అది నొక్కండి, ఇది నొక్కండి అని చెప్పే ఆంగ్లం అర్థం చేసుకోవడాలు సాధ్యంకాని పనులు. బ్యాంకు సిబ్బందే ప్రజలకు అవగాహన కల్పించాలి. అసలు బ్యాంకులు 'పది' నాణేలు నిరాకరించకుండా తీసుకుంటే ఏ సమస్యా ఉండదు. బ్యాంకులు తీసుకున్న మరుక్షణం వ్యాపారులు తీసుకుంటారు. ప్రజల్లో వినియోగం పెరుగుతుంది. కాని, అత్యధిక చోట్ల బ్యాంకు అధికారులు, సిబ్బందే పది నాణాలు నిరాకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. సమాజంలో పది నాణాల అనధికార నిషేధం కొనసాగడానికి బ్యాంకు అధికారులే ప్రధాన కారణం. ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ, పది నాణాలు చెల్లవని తీసుకోకుండా నిరాకరిస్తున్న బ్యాంకు అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. భారతదేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ, చారిత్రక, సంస్కృతిని ప్రతిబింబించే విధంగా దేశంలోని అనేక స్మారకాలను భిన్నరూపాల్లో ఉండేలా రూ.10 నాణేలను ముద్రించామని, కాలానుగుణంగా కూడా నాణేల రూపంలో, పరిమాణంలో మార్పులు వచ్చినా అవన్నీ చెల్లుబాటు అవుతాయని ఆర్‌బీఐ స్పష్టంగా చెబుతుంటే బ్యాంకులు చెల్లవని నిరాకరించడం దుర్మార్గం. బ్యాంకులు తీసుకుంటూ, ఇస్తూ ఉంటే ఏ పేచీలూ ఉండవు.

ప్రతి బ్యాంకులో 'రూ. 10 నాణేలు తీసుకోబడును' అని బోర్డు ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పిస్తే సమస్య సునాయాసంగా తీరిపోతుంది. కాని హాస్యాస్పదమైన విషయం ఏమిటంటే ఒక ఖాతాదారుడు 'కాయిన్స్ ఎందుకు తీసుకోర'ని అడిగితే, 'మా వద్ద (బ్యాంకులో) చెలామణి కాకపోతే వాటిని మేము ఏమి చేసుకోవాలి? మళ్ళీ మీరే వాటిని తిరిగి తీసు కుంటారా?' అని బ్యాంకు మేనేజరే అతి తెలివి ప్రదర్శించాడు. కొంతమంది బ్యాంకు అధికారులే మేము తీసుకోవడం లేదు. మరెక్కడైనా మార్చుకోండి అంటే, ప్రజలు ఎక్కడికి పోవాలి.. ఎవరు తీసుకుంటారు? సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి, బాధ్యతతో వ్యవహరిస్తూ, రూ. 'పది' నాణేల సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. ❖


# మస్జిద్ ఇషాఅతె ఇస్లామ్ ఢిల్లీ కోసం

## విరాళాల సేకరణ

ఢిల్లీలోని జమాఅతె ఇస్లామీ హింద్ కేంద్ర కార్యాలయం ప్రాంగణంలోని మస్జిద్ ఇషాఅతె ఇస్లామ్ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. గత కొన్నేళ్ళుగా నమాజీల రాక పెరగడంతో మస్జిద్ ఇరుకుగా మారింది. ముఖ్యంగా జుమా నమాజ్, రమజాన్ మాసం, ఈద్ నమాజ్‌లలో ఈ రద్దీ మరింత పెరుగుతోంది. దీంతో మస్జిద్ విస్తరణ పనులు చేపట్టాం. అల్‌హమ్దులిల్లాహ్ నాలుగేళ్ళ క్రితం ప్రారంభించిన విస్తరణ పనులు ఇప్పుడు తుది దశకు చేరుకున్నాయి. ఇన్షాఅల్లాహ్ పది వేల మంది నమాజ్ చదివే వీలుంటుంది.

రాబోయే రమజాన్ లోపే నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాము.

మా విన్నపం ఏమిటంటే, మస్జిద్ విస్తరణ మహత్కార్యంలో మీరూ భాగస్వాములై గొప్ప ప్రతిఫలం పొందగలరు.

అల్లాహ్ మీకు ఉత్తమ ప్రతిఫలం ప్రసాదించుగాక!

**అకౌంట్ వివరాలు**

చెక్‌పై కేవలం **"Ishaat-e-Islam Trust"** అని మాత్రమే వ్రాయండి

**ISHAAT-E-ISLAM TRUST**

**A/c No. 1447308306**
**IFSC Code : CBIN0282953**

**Central Bank of India,**
**Sukhdev Vihar, New Delhi**

28

# విశ్వాసుల మాత సయ్యిదా ఆయిషా رضي الله عنها

ఉర్దూ మూలం : అల్లామా సయ్యిద్ సులైమాన్ నద్వి (రహ్మ) | తెలుగు రూపం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

**రాయబారి** మదీనా చేరుకున్నాడు. కాకతాళీయంగా అది శుక్రవారం రోజు. ప్రవక్త ప్రియసహచరులు (ర.అన్‌హుమ్), సామాన్య ప్రజలు చాలామంది మస్జిదె నబవీకి వచ్చి ఉన్నారు. రాయబారి లేచి బిగ్గరగా ఇలా అన్నాడు : "మదీనా వాసులారా! నేను బస్రా వాసుల తరపున వచ్చాను. ఆ ఇద్దరు మహనీయులు (తల్హా, జుబైర్‌లు) ఇష్టపూర్వకంగా విధేయతా ప్రమాణం చేశారా? లేక విధేయతా ప్రమాణం చేసి తీరాల్సిందేనని వారిని బలవంతం చేయటం జరిగిందా? నాకు సూటిగా సమాధానం ఇవ్వండి"- మస్జిద్‌లో ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరించింది. అంతలో ఒక కంఠస్వరం ఆ నిశ్శబ్దాన్ని ఛేదించింది. ఆ కంఠం మహనీయ ఉసామా బిన్ జైద్(రజి)ది. ఆయన దైవప్రవక్త దత్తపుత్రుడైన జైద్ బిన్ హారిసా (రజి) కుమారులు. ఆయన ఇలా అన్నారు: "ఆ ఇద్దరు మహనీయులు మనస్ఫూర్తిగా విధేయతా ప్రమాణం చేయలేదు. బలవంతంగా వారిద్దరి చేత విధేయతా ప్రమాణం (బైఅత్) చేయించటం జరిగింది." ఇది వినగానే మహనీయ సహ్లా బిన్ హనీఫ్ అన్సారీ (రజి) చివాలున లేచి ఆయన్ని గట్టిగా పట్టుకున్నారు. సహ్లా మహనీయ అలీ (రజి) గారికి ధార్మిక సోదరుడు. ఇది చూసి మహనీయ సుహైబ్, మహనీయ అబూ అయ్యూబ్, మహనీయ ముహమ్మద్ బిన్ ముస్లమా, మరికొంతమంది సహాబా ఒక్కసారిగా, "దేవా! ఇతను (ఉసామా) చెప్పింది సత్యం" అన్నారు. ఆ తరువాత సుహైబ్ ఉసామాను విడిపించి ఇంటికి చేర్చారు. "మేము మౌనంగా ఉండిపోయినట్లే నువ్వు కూడా మౌనంగా ఉండిపోతే ఏ గొడవా ఉండేది కాదు కదా!" అని సుహైబ్ తన ఆవేదనను వ్యక్తపరిచారు.

మార్గమధ్యంలో మహనీయ అలీ (రజి)కి సంధి షరతులు తెలిసాయి. వెంటనే ఆయన బస్రా వాసులకు ఉత్తరం వ్రాస్తూ, "ఒకవేళ వారిచేత బలవంతంగా విధేయతా ప్రమాణం (బైఅత్) చేయించినా ముస్లిం సముదాయంలో విభేదాలు, చీలికలు రాకూడదన్న ఉద్దేశంతోనే అలా చేయించటం జరిగింది" అని సంజాయిషీ ఇచ్చారు.

బస్రా రాయబారి తిరిగి వచ్చి, మదీనాలో జరిగినదంతా వివరించాడు. దానికి ప్రతిగా వ్యతిరేక వర్గంవారు మహనీయ అలీ(రజి) వ్రాసిన ఉత్తరాన్ని చూపించారు. ఈ చర్చలు

జరుగుతుండగానే మరొక సంఘటన జరిగింది. సంధి కాలంలో ఇరువర్గాల వారు ఒకే మస్జిద్‌లో, ఒకే ఇమామ్ వెనుక నమాజ్ చేసేవారు. యాదృచ్ఛికంగా జరిగిందో లేక ఉద్దేశపూర్వకంగానే జరిగిందో గాని ఇటువైపు వారు తమ తరపు మనిషిని ఇమామ్‌గా చేసి నమాజ్ చేయడం మొదలెట్టారు. నలభై మంది అరబ్బేతర వ్యక్తులు ఖడ్గాలు ఝుళిపిస్తూ వారిపైన విరుచుకుపడ్డారు. అటువైపు నుండి కూడా దీటుగా జవాబివ్వటం జరిగింది. బస్రా ఉత్తరాధికారి ఖైదీగా పట్టుకో బడ్డాడు. ఈ సంగతి తెలుసుకున్న సయ్యిదా ఆయిషా(ర.అ) తక్షణం అతన్ని విడుదల చేయించారు. మహనీయ ఉస్మాన్ (రజి)ను హతమార్చిన దుండగుల్ని దండించటం తప్ప ఇతరులెవరి జోలికీ పోవద్దని ఆమె ప్రకటన చేయించారు. దాంతో సామాన్య ప్రజలంతా ఆయుధాలు పడవేశారు. కాని హకీమ్ మాత్రం దానిని లక్ష్యపెట్టకుండా సమరం కొనసాగించాడు. ఒక చిన్న సైనిక దళం రాత్రిపూట సయ్యిదా ఆయిషా(ర.అ) విడిది చేసిన గుడారానికి వెళ్ళి, అవకాశం దొరకగానే ఆమెపై మెరుపు దాడి చేసి, ఆమెను కడతేర్చాలని వ్యూహం పన్నింది. కాని ఆ దళం అక్కడికి చేరుకుంటూ ఉండగానే రహస్యం బట్టబయలైంది. సంస్కరణా ప్రియుల విజయంతో ఆ యుద్ధం ముగిసింది. బస్రా వశమయింది. నగరంలోని అత్యధిక మంది పౌరులు విధేయతకు అంగీకరించారు. బస్రా ధనాగారం నుండి సిపాయిలకు జీతభత్యాలు పంపిణీ చేయబడ్డాయి. కూఫా, డెమాస్కస్, మదీనా తదితర పెద్ద పట్టణాలకు విజయ సమాచారం ఇవ్వబడింది.

తరువాత సయ్యిదా ఆయిషా(ర.అ) కూఫా ప్రముఖులకు వ్రాసిన ఉత్తరం ఇది :

> "అమ్మాబాద్! నేను మీకు మహిమాన్వితుడైన అల్లాహ్‌ను, ఇస్లాంను గురించి జ్ఞాపకం చేస్తున్నాను. దైవ గ్రంథాన్ని అందలి ఆదేశాలతో సహా ఆశ్రయించండి. అల్లాహ్‌కు భయపడండి. ఆయన త్రాటిని గట్టిగా పట్టుకోండి. ఆయన గ్రంథాన్ని వీడకండి. మేము బస్రా వాసులకు దైవగ్రంథం ప్రకారం మసలుకోండి అనే పిలుపు ఇచ్చాము. ఉమ్మత్‌లో సంధిని కాంక్షించే వారంతా మా పిలుపును స్వాగతించారు. మంచితనానికి విలువ ఇవ్వని వారు కరవాలాలతో మమ్మల్ని ఎదిరించారు. 'మిమ్మల్ని కూడా ఉస్మాన్(రజి) వద్దకే పంపిస్తామ'ని బీరాలు పోయారు. శత్రుత్వంతో వాళ్ళు మమ్మల్ని అవిశ్వాసులుగా ఖరారు చేశారు. అసభ్యకరమైన పదజాలంతో మమ్మల్ని దూషించారు. మేము వారికి ఖుర్‌ఆన్ ఆయత్‌ని చదివి వినిపించాము :
>
> **"గ్రంథ జ్ఞానంలోని కొంతభాగం పొందినవారి పరిస్థితి ఎలా ఉందో నీవు గమనించలేదా? దైవగ్రంథం వారి మధ్య తీర్పు చెప్పగలందులకు గాను వారిని దాని వైపునకు ఆహ్వానించినప్పుడు, వారిలోని ఒక వర్గంవారు జారుకుంటారు. ఆ తీర్పు పట్ల వైముఖ్యం చూపుతారు."** ***(ఆలి ఇమ్రాన్ : 23)***
>
> ఇది విని కొంతమంది మాకు సహాయపడటానికి అంగీకరించారు. కొంత మంది విభేదించారు. మేము వాళ్ళను వారి మానాన విడిచిపెట్టేశాము. అయినప్పటికీ వాళ్ళు మా సహచరులపై కత్తులు దూసారు. బస్రాలో ఉత్తరాధికారిగా ఉన్న ఉస్మాన్ బిన్ హనీఫ్ తమ మనుషులకు ఒట్టేసి మరీ మాపైన ఉసిగొల్పాడు. అయితే అల్లాహ్ సజ్జనులైన తన దాసుల ద్వారా నాకు సహాయపడ్డాడు. వారి కుట్రలు వారికే బెడిసి కొట్టేలా చేశాడు. మేము 26 రోజుల వరకూ వారికి దైవగ్రంథంలోని ఆదేశాల వైపునకు ఆహ్వానించాము. అంటే అపరాధులను తప్ప వేరితరులను దండించరాదని, నిర్దోషుల రక్తం చిందించరాదని విజ్ఞప్తి చేశాము. కాని వారు మాకు వ్యతిరేకంగా ఎందుకు పోరాడాలనుకుంటున్నారో ఆధారాలు చూపారు. మేము వారితో సంధి చేసుకున్నాం. కాని వారు మాట తప్పారు. ద్రోహబుద్ధితో సైన్యాన్ని సమీకరించారు. అల్లాహ్ ఉస్మాన్ (రజి) తరపున ప్రతీకారం తీర్చుకునే అవకాశం కల్పించాడు. ఒక్కడు తప్ప ఆ దుండగులలో ఎవరూ మిగులలేదు. అల్లాహ్ ఖైస్, రబాబ్, అబ్ద్ తెగల ద్వారా మాకు తోడ్పడ్డాడు. చూడండి! ఒక్క ఉస్మాన్(రజి) హంతకులను మినహాయించితే, మిగిలిన వారిపట్ల మంచిగా మెలగండి. కాని విద్రోహులకు మాత్రం మద్దతు తెలుపకండి. వారికి ఆశ్రయం కల్పించకండి. దేవుని శిక్షకు పాత్రులైన వారిపై ఔదార్యం కురిపించకండి. ఒకవేళ మీరు గనక అలా చేశారంటే మీరు కూడా దౌర్జన్య పరులుగానే పరిగణించబడతారు."

కూఫాలోని ప్రముఖులకు ఆమె వ్రాసిన ఉత్తరం ఇలా వుంది:

"అమ్మాబాద్! వారికి (ఆ దుండగులకు) సాయం చేయకుండా, వారికి నీడ కల్పించకుండా ప్రజలను ఆపండి. వారిని తమ తమ ఇండ్లలోనే ఉండ మనండి. ఆ దుండగుల వర్గం ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్(రజి) పట్ల అమానుషంగా ప్రవర్తించింది. ముస్లిం సముదాయం మధ్యన ఉన్న పరస్పరం సహకార భావాన్ని, ఐకమత్యాన్ని చీల్చి చెండాడింది. దైవగ్రంథాన్ని, ప్రవక్త(స) విధానాన్ని బేఖాతరు చేసింది. అంతటితో ఆగకుండా ధర్మాదేశాల, దైవాజ్ఞల వైపునకు పిలుపు ఇచ్చి దైవగ్రంథం ప్రకారం ప్రజలు నడుచుకునేలా చేసేందుకు ప్రయత్నించిన మమ్మల్ని వారు అవిశ్వాసులుగా చిత్రించారు. మా గురించి అసభ్యకరమైన మాటలు మాట్లాడారు. ఉమ్మత్‌లోని శాంతి కాముకులు వారిని వ్యతిరేకించారు. వారి చర్యను మహా పాతకంగా భావించారు. వారితో ఇలా అన్నారు: "మీరు మీ నాయకుణ్ణి చంపింది గాక, ఇప్పుడు దైవ ప్రవక్త భార్యపైనే తిరగబడ్డారు. ఎందుకు? ఆమె గారు సత్యోపదేశం చేస్తున్నారనేగా. మీరు ఈనాడు ఈమె గారిని, ప్రవక్త సహచరులను, ముస్లిం నేతలను హత మార్చేందుకు సిద్ధమయ్యారు?" మేము చప్పరం వద్ద ఉండే కొంతమంది సైనికులను రక్షించాము. 26 రోజుల వరకూ ఈ ఉద్రిక్త పరిస్థితి కొనసాగింది. మేము వారిని సత్యం వైపునకు పిలిచాము. సత్యపథంలో అవరోధంగా తయారవకండి అని వారికి బోధపరచాము. కాని వాళ్ళు నమ్మక ద్రోహం చేశారు. విశ్వాస ఘాతకులుగా ప్రవర్తించారు. తల్హా, జుబైర్ (రజి. అన్‌హుమా) సమక్షంలో విధేయతా ప్రమాణం చేయనున్నామని కూడా పైకి చెప్పేవారు. కడకు నిజానిజాలను నిర్ధారించడానికి ఒక రాయబారిని మదీనాకు పంపటం జరిగింది. అతను అక్కడ జరిగిందేమిటో తెలుసుకుని వచ్చాడు. అయినా వాళ్ళు సత్యం ఎటు వైపు ఉందో పసిగట్టలేదు. దాంతో సరిపెట్టుకోకుండా ఒకసారి రాత్రి చీకటిలో నన్ను కడతేర్చే దురుద్దేశంతో దొంగచాటుగా నా విడిది స్థలం వరకూ వచ్చారు. వాళ్ళు గుడారం ముఖద్వారం వరకూ వచ్చారు. ఒక వ్యక్తి వారికి ముందుండి దారి చూపిస్తున్నాడు. ఆ సమయంలో ఖైస్, అర్‌బాబ్, అజ్ద్ తెగలకు చెందిన కొంతమంది మనుషులు నా వాకిలి వద్ద పహరాగా నిలబడి ఉన్నారు. అంతే, కథ అడ్డం తిరిగింది. వారు తవ్వుకున్న గోతిలో వారే పడ్డారు. ముస్లింలు వారిని తుదముట్టించారు. అల్లాహ్ బస్రా వాసులందరినీ తల్హా, జుబైర్(రజి) అభిప్రాయంతో ఏకీభవించేలా తోడ్పడ్డాడు. ఖిసాస్ (ప్రతీకార న్యాయం) తరువాత మేము సర్వసామాన్యమైన మన్నింపుల ప్రకటన చేస్తాము."

ఈ సంఘటన హిజ్రీ 36వ సంవత్సరం రబీవుల్ ఆఖర్ నెల 26వ తేదీన జరిగింది. ✤


## చందాదారులకు విజ్ఞప్తి

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

'చరితార్థులు'

# ముఫ్తి కిఫాయతుల్లా

65

## (1872-1952)



బ్రిటిష్ పాలకులతో పోరాడటం ముస్లింల తిరుగులేని విధిగా ప్రకటించటం మాత్రమే కాకుండా స్వరాజ్యం కోసం తానుగా ఉద్యమించి ఉద్యమ వారసులను కూడా తయారు చేసుకున్న ప్రముఖ ధార్మికవేత్త ముఫ్తీ కిఫాయతుల్లా 1872లో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని షాజహాన్‌పూర్‌లో జన్మించారు. మదరసా విద్య పూర్తయ్యాక ప్రముఖ విద్యాసంస్థ దేవ్‌బంద్‌లో చేరారు. బ్రిటిషర్ల మీద తిరుగులేని పోరాటం సాగించిన యోధులు, ఆ విద్యాసంస్థ ప్రధానాచార్యులు మౌలానా ముహమ్మద్ హసన్ ప్రభావంతో ఆయన జాతీయోద్యమంలో ప్రవేశించారు. విద్యాభ్యాసం పూర్తి చేసి ఢిల్లీ వచ్చిన ఆయన 'అంజుమన్-ఏ-హిదాయతుల్-ఇస్లాం' కు చెందిన పాఠశాల నిర్వహణా బాధ్యతలు స్వీకరించారు. ప్రజలలో దిగజారి పోతున్న ధార్మిక, నైతిక విలువలను పెంపొందించేందుకు మౌల్వీ హాఫీజ్ అబ్దుల్ ఘనీతో కలసి 'కితాబ్ ఖాన్-ఏ-రహిమియ్యా' అను ప్రచురణ సంస్థను స్థాపించారు. జాతీయోద్యమంలో ప్రధాన పాత్ర పోషించిన 'జమీఅత్-ఎ-ఉలమా -ఏ హిందీ' అధ్యక్షునిగా 1919 నుండి 1942 వరకు కిఫాయతుల్లా బాధ్యతలు నిర్వహించారు. మాతృదేశం పరాయి పాలనలో మగ్గుతున్నంత కాలం తమ ధార్మిక విద్యా ప్రచారానికి, మత స్వేచ్ఛకు, ప్రజల సంపూర్ణ స్వాతంత్ర్యానికి ఏ మాత్రం అవకాశం ఉండదని ప్రకటిస్తూ ఖిలాఫత్-సహాయ నిరాకరణోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆంగ్ల ప్రభుత్వం మీద తిరుగుబాటు మహాత్ముని మార్గ నిర్దేశనంలో సాగాలని, సాయుధ పోరాటాలు సత్ఫలితాలను సాధించలేవన్నారు. 1930లో శాసనోల్లంఘనోద్యమంలో ఢిల్లీ ప్రజానీకానికి నేతృత్వం వహించారు. ఆ కారణంగా కిఫాయతుల్లాకు జైలు శిక్ష పడింది. అప్పటి నుండి కఠిన కారాగారవాస శిక్షలు ఆయనకు సాధారణ అనుభవాలయ్యాయి. జాతీయోద్యమం నుండి కిఫాయతుల్లాను దూరం చేయాలని బ్రిటిష్ పాలకులు ఆర్థిక సదుపాయాలు, అధికారిక హోదాలు లాంటి ప్రలోభాలు చూపారు. ఆంగ్లేయుల ఎత్తులను పూర్తిగా తిరస్కరిస్తూ 'స్వాతంత్ర్యం కోసం పోరాటం ముస్లింల మతపరమైన విధి' అని ఆయన స్పష్టం చేశారు. బహుళ జాతుల, మతాల ప్రజలు సహజీవనం సాగించే భరత గడ్డ మీద మత రాజ్యాన్ని స్థాపించ ప్రయత్నించటం సరి కాదని అన్నారు. భారత విభజన, ద్విజాతి సిద్ధాంతాన్ని ఇస్లాం ధార్మిక సిద్ధాంతాల ప్రాతిపదికన ఖండించారు. హిందూ-ముస్లింల ఐక్యతను ఆకాంక్షిస్తూ నిరంతరం అందుకు కృషిచేశారు. ముస్లింలు-ముస్లిమేతరులను వివక్ష ఎంతమాత్రం తగదంటూ ఐక్యంగా ముందుకు సాగినప్పుడు మాత్రమే ఉమ్మడి లక్ష్యం సిద్ధిస్తుందని ప్రచారం చేశారు. పాశ్చాత్య విద్య, సంస్కృతి వలన సమాజం రుగ్మతలకు గురవుతుందని భావించిన కిఫాయతుల్లా సంస్కరణోద్యమాన్ని నడిపారు. పురుషులతోపాటు మహిళలు కూడా విద్యావంతులు కావాలంటూ వారి కోసం ప్రత్యేక పాఠశాలలను స్థాపించాలని కోరారు. మనుషుల్లో ఉచ్ఛ-నీచాలన్న విధానం స్వార్థపరుల సృష్టి మాత్రమేనంటూ సహపంక్తి భోజనాలలో, సహజీవనం సాగించటంలో ఏమాత్రం తప్పులేదన్నారు. మాతృభూమికి స్వాతంత్ర్యం లభించాక ధార్మిక విద్యాబోధన గావిస్తూ ఆయన పలు గ్రంథాలను రాశారు. భారతప్రభుత్వం పలు సౌకర్యాలను, ఆర్థిక సదుపాయాలను ప్రకటించగా, వాటిని స్వీకరించడం అంటే తమ దేశభక్తికి విలువ కట్టడమేనంటూ ఆ సౌకర్యాలను, సదుపాయాలన్నిటిని తిరస్కరించి అతి సామాన్య జీవితం గడిపిన ముఫ్తీ కిఫాయతుల్లా 1952 డిసెంబరు 31న ఢిల్లీలో కన్నుమూశారు.




✆ 9440241727

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్ర కారుడు, బహుగ్రంథ కర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' (తెలుగు) 'ది ఇమ్మోర్టల్స్' (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం



# బంధాలు.. అనుబంధాలు..

**- తహ్సీన్ హుమైర్వీ**

హజ్రత్ అబూతల్హా అన్సారీ (రజి) మదీనా నగరంలో ధనికుల్లో ప్రముఖులు. ఆయన గారికి అనేక ఖర్జూర తోటలుండేవి. వాటిలో మస్జిదే నబవీ ఎదురుగా ఉండే “బైరహా” అనే పేరుగల ఖర్జూరపు తోట అంటే ఆయనకు ఎంతో ఇష్టం. ప్రవక్త మహనీయులు (స) తరచూ అక్కడ సేదతీరేవారు. ఆ తోటలోని మంచి నీళ్లు తాగే వారు. ‘మీరు అమితంగా ప్రేమించే వస్తువులను అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టనంత వరకు మీరు సత్కార స్థాయికి చేరుకోలేరు’ అనే దైవ సూక్తి అవతరించింది.

ఇంకేముంది వెంటనే ఆయన దైవ ప్రవక్త (సఅసం) వద్దకు చేరుకుని,“దైవప్రవక్తా (సఅసం)! నేనెంతో ప్రేమించే బైరహా తోటను దైవమార్గంలో ఇచ్చేస్తున్నాను” అని ప్రకటించారు. “ఇది మంచి లాభదాయకమైన వ్యాపారం. దీన్ని అవసరార్థులైన నీ బంధువులకు పంచిపెడితే బాగుంటుందని ప్రవక్త అభిప్రాయపడ్డారు. ప్రవక్త సలహా మేరకు ఆయన ఆ తోటను పెదనాన్న కుమారులకు పంచివేశారు.

### బంధాలు, బాంధవ్యాలు దైవం ప్రసాదించిన వరాలు

అందుకే దైవం తన గ్రంథంలో ఈ విధంగా హెచ్చరిస్తున్నాడు: “ఏ దేవుని పేరు చెప్పుకొని మీరు పరస్పరం మీ మీ హక్కులను కోరుకుంటున్నారో ఆ దేవునికి భయపడండి. బంధుత్వ

సంబంధాలను తెంచటం మానుకోండి. అల్లాహ్ మిమ్మల్ని పరికిస్తున్నాడనే విషయాన్ని తెలుసుకోండి.''(4:1)

హజ్రత్ ఆయిషా(రజి), దైవప్రవక్త (సఅసం)ఇలా తెలియ జేశారనీ అన్నారు. ''బంధుత్వం దైవ పీఠానికి వ్రేలాడుతూ ఉంటుంది. నాతో సత్సంబంధాలు పెట్టుకున్న వారితో దేవుడు కూడా సంబంధాలు పెట్టుకొనుగాక! నన్ను విచ్ఛిన్నం చేసిన వాడిని దేవుడు కూడా విచ్చిన్నం చేయుగాక! అని ప్రార్థిస్తూ ఉంటుంది.'' *(బుఖారీ, ముస్లిం)*

వేరొక హదీసులో ''దేవుడు సమస్త సృష్టిరాసుల్ని సృష్టించిన తర్వాత బంధుత్వం లేచి నిలబడి దేవా! నేను బంధుత్వం తెగతెంపుల బారి నుండి నీ శరణు కోరుకుంటున్నాను'' అని అంది. దానికి ''అయితే నీతో సత్సంబంధాలు పెట్టుకున్న వాడితో నేనూ సత్సంబంధాలు పెట్టుకుంటాను. నీతో తెగ తెంపులు చేసుకున్న వాడితో నేనూ తెగతెంపులు చేసుకుం టాను. ఇది నీకు ఇష్టమే కదా'' అని అడిగాడు దేవుడు. దానికి బంధుత్వం ''ఇష్టమే ప్రభూ'' అని అంది. అప్పుడు దేవుడు సరే ఆ భాగ్యం నీకు దక్కుతుంది అని అన్నాడు.

కొందరు ధార్మిక సమావేశల్లో అద్భుతమైన ప్రసంగాలు చేస్తూ కనిపిస్తారు కానీ బంధాలను ఏమాత్రం లెక్క చేయరు. బంధువులకు అసలు విలువివ్వరు. ''ఉపాధిలో సమృద్ధిని, ఆయుష్షు పెరగాలనుకునేవారు తన బంధువులతో సత్సం బంధాలు పెట్టుకోవాలి'' అన్నది ప్రవక్త బోధన. ఒక సారి ఒక వ్యక్తి దైవప్రవక్త (సఅసం) వద్దకు వచ్చి దైవప్రవక్తా! నా బంధువులు కొందరున్నారు. వారితో సత్సంబంధాలు కొనసాగించాలని ప్రయత్నిస్తున్నప్పటికీ వారు మాత్రం నాతో తెగతెంపులు చేసుకోవాలని చూస్తున్నారు. నేను వారి పట్ల మంచిగా మెలుగుతుంటే వారేమో నాకు కీడు తలపెడు తున్నారు. నేను వారిపట్ల ఉదార వైఖరిని అనుసరిస్తుంటే వారు మాత్రం నా పట్ల మూర్ఖంగా ప్రవర్తిస్తున్నారు.'' అని తన గోడు వినిపించుకున్నాడు. ఇది విని ఆయన ''నీవు చెప్పింది నిజమే అయితే నువ్వు వారి నోళ్ళలో వేడి బూడిదను పోస్తున్నావనుకో. నువ్వు మాత్రం వారి పట్ల ఇలాగే మంచిగా ఉన్నంతకాలం దేవుని తరపు నుండి వారికి వ్యతి రేకంగా ఒక సహాయకుడు నీ వెంట ఉంటాడు'' అని అన్నారు. (ముస్లిం) ❖

# చిరునామా


**ఎస్.ఎమ్. మలిక్**

మౌనశిఖరాలలో జనించే
జీవన రాగానికి నామం
కవనం
వినగల హూరున వీచె గాలివాన
శూన్యంలో అవుతుంది
ఉత్పన్నం!

జీవనరసంలో మనస్సాక్షిని
నిండా ముంచి ఆత్మ చెందిన తృప్తి వైనం
ఆవేదనం
ఎలా బోధపడుతుంది బుద్ధికి...
నిరంకుశం!

మనుగడ అంటే బుద్ధిజీవి కృషి కాదు
కృషీవలుని సాధన
నిరంతరం!
శాంతీ అసంతులనముల మధ్య
అదుపునకై చేయ గలిగిందీ లేనిదీ
జీవన ఫలమే
సంఘర్షణం!!

సంతప్త శిరస్సుకు వృక్షచ్ఛాయ
వరప్రసాదమయితే
హృదయావేదనకు ఓ శీతలవచనం
అమృతం!
ఓ ఆశాద్వీపాన లేచిన ప్రేమైక హస్తమే
అక్షర స్వప్నమయితే...
స్వర్గతుల్యం !!
జీవనవీధికి యత్నస్వేదమే మార్గచిహ్నం కాంతిస్థంభం!!!



# ‘ఉజ్వల తారలు’ గ్రంథం ఆవిష్కరణ

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్** పుస్తకాల జాబితాలో మరో గ్రంథం చేరింది. టి.ఐ.పి. సిరీస్ నెం.315గల ఈ పుస్తకానికి ఎంతో విశిష్టత ఉంది. ముహమ్మద్ ప్రవక్త (స) ప్రియ సహచరుల పవిత్ర జీవితంలోని ముఖ్య ఘట్టాల సంకలనమే ఈ పుస్తకం. **‘హయాతే సహాబాకే దరక్షా పహ్లూ’** ఉర్దూ అనువాదాన్ని ఖుర్ఆన్ అనువాదకులు **ముహమ్మద్ అజీజుర్రహ్మాన్ ‘ఉజ్వల తారలు’** పేరుతో తెలుగురూపమిచ్చిన తీరు ఆకట్టుకుంటుంది. ఇంతటి గొప్ప గ్రంథాన్ని 27వ తేదీ ఆదివారం తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్టు ఛైర్మన్ మౌలానా హామిద్ ముహమ్మద్ ఖాన్ ఆవిష్కరించారు. జమాఅతె ఇస్లామీ హింద్ రాష్ట్రస్థాయి నాయకులు, జిల్లాల బాధ్యుల సమావేశంలో తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్టు డైరెక్టర్ ఇంజనీర్ సలీమ్ అహ్మద్ ఖాన్, ట్రస్టు సీఈవో అబ్దుల్ వాహెద్, పుస్తక అనువాదకులు ముహమ్మద్ అజీజుర్రహ్మాన్‌తో కలిసి ఈ గ్రంథాన్ని ఆవిష్కరించారు. ‘ఈ పుస్తకంలో కంటతడిపెట్టించే సంఘటనలు, ఆనాటి ప్రవక్త సహచరుల జీవిత ఆదర్శాలు పుస్తకం నిండా ఉన్నాయి’ అని మౌలానా హామిద్ ముహమ్మద్ ఖాన్ అన్నారు. క్లిష్టపరిస్థితుల్లో ప్రవక్త సహచరులు చూపిన సహనస్థయిర్యాలు మనందరికీ ఆదర్శనీయమని ఆయన చెప్పారు. పుస్తకం చదువుతున్నం తసేపూ అందులో లీనమయ్యేలా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఆనాటి బానిస వ్యవస్థ ఎలా ఉండేదో, ఆ బానిసత్వ సంకెళ్ల నుండి ప్రవక్త (స) వారిని ఎలా విముక్తం చేశారో ఈ పుస్తకం చదివితే తెలుస్తుందని మౌలానా అన్నారు. ప్రతీ ఒక్క ఉద్యమ కార్యకర్త ఈ గ్రంథాన్ని అధ్యయనం చేయాలని సూచిం చారు. గ్రంథ మూల రచయిత అబ్దుర్రహ్మాన్ రాఫ్త్ అల్ బాషా అరబీ సాహిత్యంలో సుప్రసిద్ధులని, అరబ్బు ప్రపంచంలో ఈ పుస్తకం ఎంతో ప్రాచుర్యం పొందిందని, పలు ఇస్లామిక్ యూనివర్శిటీల్లో పాఠ్యపుస్తకంగా ఉందన్న విషయాన్ని అజీజుర్రహ్మాన్ని ప్రస్తావించారు. 400 పేజీలకు పైచిలుకు ఉన్న ఈ పుస్తకం రూ.300లుగా నిర్ణయించా మని, రాయితీపై రూ.180లకు అందిస్తున్నామని ట్రస్టు డైరెక్టర్ సలీమ్ అహ్మద్ ఖాన్ ప్రకటించారు. ఈ పుస్తకం చదువుతున్నంతసేపూ ఏదో ప్రశాంతత ఆవరిస్తుంది. చక్కని ధార్మిక అనుభూతి కలుగుతుంది. ధర్మంపై నిలకడ ప్రదర్శించడానికి ఈ పుస్తకంలోని గాథలు స్ఫూర్తినిస్తాయి. ‘గ్రంథంలో మొదటిపేజీ మొదలు చివరి పేజీ వరకూ త్యాగ స్ఫూర్తిని నింపే ఎన్నో ఘటనల చిత్రణ ఉంది. ప్రముఖ రచయిత అబుల్ ఫౌజాన్ సంకలనం చేసిన ‘ఎంత అద్భుతం ఈ ఖుర్ఆన్’ పుస్తకాన్ని కూడా ఈ మౌలానా హామిద్ ముహమ్మద్ ఖాన్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జమాఅతె ఇస్లామీహింద్ జనరల్ సెక్రటరీ నశీరుద్దీన్, గీటురాయి మేనేజర్ సయ్యద్ హుసేన్, సేల్స్ మేనేజర్ యాసీన్ తదితరులు పాల్గొన్నారు. ✤

వైరల్ స్టోరీ



# భలే మంచి టైమ్

- సుమయ్యా

**పెళ్లి వేడుక జరుగుతోంది.** అందులో ఒక వ్యక్తి తనకు తెలిసిన ఓ పెద్దాయనన్ను గుర్తుపట్టి వెళ్లి పలకరించాడు. ఆ పెద్దాయన చూపు ఆనకపోవడంతో పలకరించింది ఎవరా కళ్లకు చెయ్యి అడ్డుగా పెట్టి పట్టిపట్టి చూశాడు. తీరా గుర్తు పట్టాడు. 'నువ్వు ప్రైమరీ స్కూలు శిష్యుడివి కదూ. ఇప్పుడేం చేస్తున్నావురా' అని నవ్వుతూ ఆప్యాయంగా అడిగారాయన. 'నేనూ మీలానే స్కూల్ టీచర్‌ను. దీనికి మీరే స్ఫూర్తి' అని సంతోషంగా చెప్పాడు. అదెలారా నాయనా అని అడిగితే గతం లోకి వెళ్లాడు.. 'ఒకరోజు క్లాస్ రూములో ఒక విద్యార్థి చేతి వాచి దొంగతనానికి గురయ్యింది. ఆ వాచీ నాకెంత గానో నచ్చడంతో దాన్ని నేనే దొంగిలించాను. వాచీని ఎవరైతే తీశారో వెంటనే ఇచ్చేయాలని క్లాసులో ప్రకటించారు. ఆ సమయంలో గడియారాన్ని తిరిగి ఇచ్చేయాలనుకున్నాను కానీ భయంతో ఇవ్వలేకపోయాను. అందరి ముందూ పరువు పోతుందని భయపడ్డాను. మమ్మల్ని అందరినీ గోడవైపునకు తిరిగి కళ్లుమూసుకొని నిల్చోవాలని చెప్పారు. మేమంతా అలా నిలబడ్డాక అందరి జేబులు గాలించారు. అప్పుడు నా జేబులోనే ఆ గడియారం దొరికింది. నా పేరు మాత్రం ఎవ్వరికీ చెప్పకుండా ఆ గడియారం ఎవరిదో అతనికి ఇచ్చేశారు. ఆ రోజు మీరు చేసిన మంచి పని నాలో ఎంతో పరివర్తన తీసుకొచ్చింది. ఇంకెప్పుడూ దొంగతనం చేయరాదని నిర్ణయించుకున్నాను. నేను కూడా టీచర్ కావాలని గట్టిగా సంకల్పం చేసుకున్నాను.' అని పాతరోజులను గురువుగారితో నెమరవేసుకున్నాడు. అంతలో గురువు గారు కలుగజేసుకుని 'ఆ సందర్భంలో నేను కళ్లకు గంతలు కట్టుకున్నాను. ఆ వాచీ దొంగిలించిందెవరో నాకూ ఈ రోజే తెలిసింది' అని చెప్పడంతో ఆ విద్యార్థి ఆశ్చర్యపోయాడు.

భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మాణమవుతుందని పెద్దలు చెబుతారు. రేపటి పౌరులైన పసి హృదయాలకు సుశిక్షణ అందిస్తే, వారిని ప్రేమానురాగాలతో సంస్కరిస్తే మంచి ఫలితాలుంటాయి. ఒకరిలో మార్పు, పరివర్తన తీసుకురావాలంటే విజ్ఞత, వివేచనతో సంస్కరించాలన్నది ఇస్లామ్ బోధనల సారం. చివరికి విమర్శ కూడా మృదువుగా ఉండాలంటారు ఉలమాలు. మృదుత్వంతో అంతరాత్మ మేల్కొంటోంది. కాఠిన్యంతో అహంకారం మేల్కొంటోంది అంటారు. ఎదుటి వారిలో తప్పులెంచడం ఎవరైనా చేస్తారు. చేసే తప్పును సవరించడం కొందరికే సాధ్యమవుతుంది. ✦


యువతరానికి విప్లవనాదం
చేతన వాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

*అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.*

**తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ (ఖుర్‌ఆన్ అవగాహనం): మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది, తెలుగురూపం: ఎస్.ఎమ్. మలిక్**

**88 ఆయత్‌లు** **మక్కా అవతరణ**

# 38. సాద్

23-24... ఇతను నా సోదరుడు, ఇతని వద్ద తొంభయి తొమ్మిది ఆడ గొర్రెలున్నాయి, నా వద్దనయితే కేవలం ఒక్కటే ఆడ గొర్రె ఉంది. ఇతను ఆ ఒక్క ఆడ గొర్రెను సయితం నాకు అప్పజెప్పు అని అంటున్నాడు, మరేమో ఇతను మాటలతో నన్ను లోబరచుకున్నాడు."[24] దావూద్ సమాధానంగా, "ఈ వ్యక్తి తన గొర్రెలతో పాటు నీ గొర్రెను కూడా కలుపుకోవాలని కోరి నిశ్చయంగానే నీ పట్ల అన్యాయం చేశాడు,[25] వాస్తవానికి కలిసి మెలిసి సహజీవనం చేసే జనులు తరచుగా ఒకరిపై నొకరు అక్రమాలు చేస్తూనే ఉంటారు. అయితే విశ్వాసం గలవారు, సదాచరణ జరిపేవారు మాత్రమే దీన్ని తప్పించుకుని ఉన్నారు, ఇటువంటి వారు బహు అరుదు." (ఈ మాట పలుకుతూ ఉండగా) దావూద్ గ్రహించాడు, ఇది వాస్తవానికి మేము అతన్ని పరీక్షించిన వైనమని, కనుక అతను తన ప్రభువును క్షమాభిక్ష అర్థించాడు, సజ్దాలో పడిపోయాడు, దైవం వైపునకు మరిలాడు.[26]

---

24. ముందు వచ్చే విషయాన్ని అర్థం చేసుకునేందుకు ఈ విషయం దృష్టిలో ఉండటం అవసరం. 'ప్రత్యర్థి వ్యక్తి నా గొర్రెను లాక్కున్నాడు, తన గొర్రెల్లో కలుపుకున్నాడు' అని దావా వేసిన వ్యక్తి చెప్పడం లేదు. అలాకాక, 'నా గొర్రెను ఇవ్వమని నన్ను అడుగుతున్నాడు, ఇతను తన మాటలతో నన్ను లొంగదీసుకున్నాడు ఈ వ్యక్తి ఉన్నత స్థాయిగల మనిషి, నేనేమో ఒక నిరుపేదను కాబట్టి, ఇతని కోర్కెను కాదనేంత శక్తి నాలో లేదు' అని మాత్రమే చెబుతున్నాడు.

25. ఇక్కడ మహనీయ దావూద్ (అ), ఒక వ్యక్తి చేసిన ఆరోపణ పైనే తన తీర్పును ఎలా ప్రకటించారు అన్న సంశయం ఎవరికీ కలగరాదు. అసలు విషయం ఏమిటంటే, దావేదారు చేసిన ఆరోపణను ముద్దాయి మౌనం వహించి, దాన్ని ఖండిస్తూ ఏమీ చెప్పకపోవడం మాత్రమే చాలు అతను దాన్ని అంగీకరించాడనడానికి. దాని కారణంగానే హజ్రత్ దావూద్ (అ), దావేదారు చెప్పింది వాస్తవం అన్న నిర్ణయానికి వచ్చారు.

26. ఈ ఆయత్ పఠనం తరువాత తిలావత్ సజ్దా (పారాయణ ప్రణామం) వాజిబ్ (విధి) అవుతుందా కాదా అన్న విషయంలో అభిప్రాయభేదముంది. ఇమామ్ షాఫియీ ప్రకారం ఇక్కడ సజ్దా వాజిబ్ కాదు. ఇది ఒక ప్రవక్త పశ్చాత్తాపం మాత్రమే. అయితే ఇమామ్ అబూ హనీఫా వాజిబ్ అనే నమ్మేవారు. ఈ సందర్భంలో ఇబ్ను అబ్బాస్ చెప్పగా, హదీసువేత్తలు ఉటంకించిన మూడు ఉల్లేఖనాలున్నాయి. ఇక్రిమ ఉల్లేఖనం ప్రకారం ఇబ్ను అబ్బాస్, "ఇది సజ్దా వాజిబ్ అయ్యే ఆయత్‌ల లోనిది కాదు, కాని నేను ఈ సందర్భంలో ప్రవక్త మహనీయులు(స) సజ్దా చేయగా చూశాను" అని చెప్పారు (బుఖారీ, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ముస్నద్ అహ్మద్). రెండవ ఉల్లేఖనం ఆయన ద్వారా సయీద్ బిన్ జుబైర్ ఉటంకించారు. దాని పదాలు ఇలా ఉన్నాయి: "సాద్" సూరాలో ప్రవక్త మహనీయులు(స) సజ్దా చేసి ఇలా అన్నారు, "దావూద్ (అ) తౌబా(పశ్చాత్తాపం) సూచకంగా సజ్దా చేశారు, మేము కృతజ్ఞతా సూచకంగా సజ్దా చేస్తున్నాము' అంటే ఆయన తౌబా స్వీకరించబడినందుకు (నసాయి). మూడవ ఉల్లేఖనం ముజాహిద్ ఉటంకించింది. ఇందులో ఆయన ఇలా సెలవిచ్చారు, "దివ్యఖుర్‌ఆన్‌లో పరమ ప్రభువు ప్రవక్త మహనీయుల (స)కు ఆదేశమిచ్చాడు, 'వీరు అల్లాహ్ సన్మార్గం చూపిన వ్యక్తులు కనుక, నీవు వారి విధానాన్ని అనుసరించు" అని. హజ్రత్ దావూద్ (అ) కూడా ఒక ప్రవక్తే గనుక, ఆయన ఈ సందర్భంలో సజ్దా చేశారు గనుక, ప్రవక్త మహనీయులు సయితం ఆయన అనుసరణలో ఇక్కడ సజ్దా చేశారు (బుఖారీ). ఈ మూడు వివరణలు హజ్రత్ ఇబ్ను అబ్బాస్ ఇచ్చినవి. హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ ఉల్లేఖనం ఏమిటంటే, ప్రవక్త మహనీయులు (స) ఒకసారి తన ప్రసంగంలో 'సాద్' సూరా పఠించారు.

**(26వ పాదసూచిక తరువాయి భాగం వచ్చే సంచికలో)**

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (3వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా (ర.అలై)**

**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

# వాణిజ్య ప్రకరణం

**(క్రయ విక్రయాలు)**

**340)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రార్థించారు: "అల్లాహ్! మదీనా వాసుల కొలతల్లో సమృద్ధిని వొసగు. వీరి 'సా'లో శుభాన్ని వొసగు. వీరి 'ముద్'లో బరకత్‌ని ప్రసాదించు."

అధ్యాయం : 53

## ఆహార ధాన్యాలను అమ్మటం, నిల్వ చేయటం గురించి[1]


**341)** తన తండ్రి (అబ్దుల్లాహ్ బిన్ ఉమర్-రజి) ఈ విధంగా చెప్పారని సాలిమ్ తెలిపారు: "నేను దైవ ప్రవక్త(సఅసం) కాలంలో కొంతమందిని చూశాను. వారు ఆహార ధాన్యాల రాశులను (తూకం వేయకుండా, కొలవకుండానే కేవలం అంచనా వేసి) కొనుగోలు చేసేవారు. అలాంటి వారు దెబ్బతినేవారు. ఎందుకంటే వారు (ధాన్యాన్ని) ఇంటికి తీసుకెళ్ళనంతవరకూ, అమ్మనంతవరకూ ఆ వర్తకం సరైనది కాదు.

**342)** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు : "ధాన్యాన్ని పూర్తిగా తన అధీనంలో తీసుకోనంతవరకూ దానిని అమ్మడాన్ని దైవప్రవక్త(సఅసం) వారించారు". తావుస్ ఇలా అన్నారు : 'అలా ఎందుకని?' అని నేను ఇబ్నె అబ్బాస్(రజి)ను అడగ్గా, ఆయన ఇలా వివరించారు-"ఎందుకంటే, ఇది రూపాయికి మారుగా రూపాయి అమ్మకం అయింది. (అసలక్కడ ధాన్యమే లేదు) ధాన్యమైతే పంట వచ్చినప్పుడే ఇవ్వబడుతుంది.[1]

**343)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) చెబుతుండగా తాను విన్నానని అబ్దుల్లాహ్ బిన్ దీనార్ తెలిపారు: "ఎవరు ధాన్యాన్ని కొనుగోలు చేసినా, ఆ ధాన్యాన్ని తన అదుపులో తీసుకోనంతవరకూ దానిని అమ్మకానికి పెట్టరాదు" అని ప్రవక్త మహనీయులు (స) ఉద్బోధించారు.

53-1. వస్తువుల ధరలు పెరుగుతున్న సమయంలో ఆహార ధాన్యాలను కొనుగోలు చేసి నిల్వ చేయడాన్ని 'ఎహ్తెకార్' అంటారు. ధరలు ఇంకా పెరిగిన తరువాత అమ్మాలన్న ఉద్దేశంతో ఈ పని చేయబడుతుంది. ఇది ధర్మసమ్మతం కాదు. సాధారణ పరిస్థితుల్లో కొనుగోలు చేసి ఇంట్లో పెట్టుకుంటే తప్పులేదు. అలాగే ధరలు పెరిగే అవకాశముందని తలపోసి, తన ఇంటివారల కోసం కొనిపెట్టుకున్నా దోషం లేదు. కాని తమ వ్యాపార ప్రయోజనాల దృష్ట్యా కృత్రిమ నిల్వలు సృష్టించి, మార్కెట్‌లో వస్తువుల కొరతని సృష్టించటం మాత్రం అధర్మం. ముస్లింలోని ఒక ఉల్లేఖనం ప్రకారం పాపాత్ముడైనవాడే 'ఎహ్తెకార్'కు పాల్పడుతాడు. ఇబ్నుమాజా, హాకిమ్‌లు వెలికి తీసిన దాని ప్రకారం, ఎవరయితే కృత్రిమ నిల్వల ద్వారా ముస్లింలకు ఆహార ధాన్యాల కొరతను సృష్టిస్తాడో అతనిని అల్లాహ్ కుష్ఠు వ్యాధికి గురిచేస్తాడు.

342-1. అదెలాగంటే, ఉదాహరణకు: జైద్ అనే వ్యక్తి ఉమర్ దగ్గర వెయ్యి రూపాయలకు బదులుగా రెండు బస్తాల గోధుమలు కొన్నాడు. రెండు నెలల తర్వాత ధాన్యం ఇస్తానని ఉమర్ వాగ్దానం చేశాడు. ఆ విధంగా వర్తక ఒప్పందం కుదిరింది. ఈ లోగా జైద్ ఏం చేశాడో తెలుసా? అవే రెండు బస్తాల గోధుమలను బకర్ అనే వ్యక్తికి రెండువేల రూపాయలకు బదులుగా అమ్మేశాడు. ఇది వడ్డీ అయింది. ఎందుకంటే అసలక్కడ గోధుమలే లేవు. అవైతే రెండు నెలల తర్వాత లభిస్తాయి. ఇక్కడేమో రూపాయికి బదులుగా రూపాయి అమ్ముడవుతోంది.




**సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమరీ**

ఒక విషయం గురించి ఏమీ తెలియనప్పుడు అజ్ఞానం ఉందంటాం. ఆ అజ్ఞానం ఏదో ఒక నమ్మకానికి దారి తీస్తుంది. ఆయా విషయాల గురించి నిజాలు తెలిసిన తర్వాత అజ్ఞానం తొలగి విజ్ఞానం చోటు చేసుకుంటుంది. అయితే నిజం వెలుగు చూసిన తర్వాత కూడా పూర్వ నమ్మకాన్నే పట్టుకు వ్రేలాడితే దాన్ని మూఢ నమ్మకం, అంధ విశ్వాసం అంటాము. అలా మూఢ నమ్మకాలకు కొమ్ము కాసేవారు పవిత్రం కాని దానికి పవిత్రతను అంటగటతారు. దైవం కాలేని వాటిని దైవంగా ప్రతిష్టింపజేస్తారు. నిజ ప్రభువు అయిన అల్లాహ్‌కు ఇవ్వాల్సిన స్థానాన్ని, ఘనతా గౌరవాలను ప్రవక్తలకు, పుణ్య పురుషులకు ఆపాదిస్తారు. పర్యవసానం అంధ విశ్వాసం పరవళ్ళు తొక్కుతుంది. ఇటువంటి అజ్ఞానాంధకారాల్లో కొట్టు మిట్టాడే వ్యక్తి ఆకాశంలో మెరుపు తీగ కనిపిస్తే దాన్ని ఏదోక దేవత ఝుళిపించిన కొరడాగా భావిస్తాడు. సూర్యచంద్ర గ్రహణాలను చూసి దేవతలకేదో విపత్కర పరిస్థితి ఏర్పడిం దని తలపోస్తాడు. 'మశూచి రోగాన్ని' పోలేరమ్మగా, చికెన్ ఫాక్స్‌ను 'అమ్మోరు'గా భావించి అలౌకికానందంతో హారతి పడతాడు. వర్షాలు పడటానికి జల యజ్ఞం అంటూ వందల కొలది నెయ్యి డబ్బాలు నిప్పుల్లో ధారబోస్తాడు. జబ్బులు తగ్గడానికి వాతలు పెడతాడు. క్షుద్ర పూజలంటూ పసికందుల్ని బలిగొంటాడు.

'పవిత్రత' పేరుతో మొదలయిన ఈ బహుదైవారాధనా భావం స్వార్థపరులైన మత నాయకులకు, పీఠాధిపతులకు, పోపులు, బిషప్పు లకు, పీష్వాలకు, పీర్లు, ముర్షిద్‌లకు - ముఖ్యంగా రాజులకు సువర్ణావకాశంగా పరిణమించింది. ప్రజల బలహీనతను పసిగట్టిన అవకాశవాదులు ఇటువంటి మూఢ నమ్మకాలను మరింత వ్యవస్థీకృతం చేశారు. 'గాడ్ కింగ్' అన్న సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టారు. ప్రజలకు - ప్రభువుకు మధ్య తాను వారధి లాంటి వాడనని ఒకడంటే, తన ప్రసన్నత లోనే దైవ ప్రసన్నత ఇమిడి ఉందని ఇంకొకడన్నాడు. వేరొకడు మరింత ముందుకెళ్ళి తానే భగవత్ స్వరూపుణ్ణని, అవతార పురుషుణ్ణని ప్రకటించుకున్నాడు. ఈ 'గాడ్ కింగ్' అనే సిద్ధాంతం మూలంగా అధికార, రాజకీయ వ్యవస్థలో చెడు తారాస్థాయికి చేరుకుంది.

జ్ఞానం వెలుగైతే అజ్ఞానం చీకటి. విజ్ఞానం వికసించాలన్నా, సైన్స్ భావాలు పరిఢవిల్లాలన్నా, సాంకేతిక పరమైన ఆలోచనలు మొగ్గ తొడగాలన్నా- భావ స్వాతంత్ర్యం ఎంతో అవసరం. కానీ ఈ స్వేచ్ఛావాయువులు అన్ని దేశాల్లోలాగే అరబ్బులో, భారతదేశంలో, గ్రీకు దేశంలో సయితం అందని ద్రాక్షగానే ఉండేవి. ఏథెన్స్ నగర యువకుల్లో స్వేచ్ఛా భావాలను పెంచి పోషిస్తున్నాడన్న అభియోగంపై సోక్రటీస్ బలవంతంగా విషం త్రాగాల్సి వచ్చింది. భారతదేశంలో శూద్రులు వేదాలు చదవకూడదు, వినకూడదు అన్న నిషేధాజ్ఞలాగే గ్రీకు దేశంలో సయితం ఇతరత్రా గ్రంథాలు చదవకూడదన్న ఆంక్షలు విధించబడ్డాయి. ఎందరో కళా పిపాసులు, తాత్వికులు దేశ బహిష్కరణ గావించబడ్డారు. కారాగారాల్లో కుక్కివేయబడ్డారు. ఉరికంబాలకు వ్రేలాడ దీయబడ్డారు. యూరిఫాయిడ్స్, సోక్రటీస్, అరిస్టాటిల్, ఫిరియాస్ మొదలగువారు ఈ కోవకు చెందినవారే. ఒక్క మాటలో చెప్పాలంటే ఇస్లాం ఆవిర్భావానికి పూర్వం ఎక్కడా శాస్త్రీయ విజ్ఞానానికి సంబంధించిన స్వేచ్ఛ ఉన్నట్టు కనబడదు. మరలాంటప్పుడు స్వయంగా అరబ్బుల్లో ఈ ఆలోచన ఎలా పుట్టింది? సాధారణంగా మిగతా ప్రపంచం ఏ వెనుకబాటుతనానికి, స్తబ్ధతకు లోనై ఉండేదో అదే భావదారిద్ర్యం, దాస్యానికి అరబ్బులు కూడా గురై ఉన్నప్పుడు వారెలా అందరికి మార్గదర్శకం కాగలిగారు?

సమాధానం- తౌహీద్. అదే వారి మనో వికాసానికి, క్రియాత్మక విప్లవానికి హేతువు అయ్యింది. మిగిలిన జాతుల్లో 'షిర్క్' అజ్ఞానం ఉండగా, అరబ్బుల దగ్గర 'తౌహీద్' విజ్ఞానం ఉండేది. ఈ వ్యత్యాసమే చరిత్రలో అసాధారణమైన పరివర్తనకు కారకం అయింది. ఇది ముస్లింలు సాధించిన విజయం కాదు; ఇస్లాం, ఖుర్ఆన్ ద్వారా వారికి ప్రాప్తమయిన మహదానుగ్రహం. క్రీస్తు శకం 7వ శతాబ్దిలో మహా ఇస్లాం ద్వారా ఓ గొప్ప విప్లవం వచ్చింది. అది బహుదైవోపాసన, గాడ్ కింగ్ పెత్తనంతో కూడుకున్న వాతావరణాన్ని ప్రక్షాళించి ఏకేశ్వరోపాసనా భావ విప్లవానికి, స్వేచ్ఛకు అగ్రస్థానాన్ని కేటాయించింది. ఆ విధంగా మానవ చరిత్రలో ప్రకృతికి సంబంధించిన స్వేచ్ఛా పరిశోధనల నూతన యుగం మొదలయింది. ఈ యుగం వెయ్యేళ్ళ నిరంతర సాధనానంతరం నేటి ఆధునిక సైన్, సాంకేతిక పరిజ్ఞానం దశకు చేరుకుంది. కాబట్టి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఆధునిక సైన్స్ ఇస్లామీయ (తౌహీద్) విప్లవ ప్రభావమే. కాబట్టి --

భావి భాగ్యవిధాతల్లారా! అందరూ నడిచిన బాటలో నడవడం తేలిక. అదే దశాబ్దాలుగా మనం చేస్తున్న పని. ఈ రంగంలో మీరు కొత్త అధ్యాయానికి నాంది వాచకంగా నిలవాలి. నూతన బాటలు వేయాలి. అలా చేయడమంటే గొప్ప సాహసం, తెగింపు మీలో ఉండాలి. ముళ్ళు తొక్కాలి, తుప్పల మీదుగా సాగాలి మీరు. ముళ్ల గుచ్చుకుంటాయి, కాళ్ళు గీచుకుపోతాయి. మీరు నడిచే బాట జనానికి ఉపయోగకరం అని తేలేదాకా జనం కూడా ఎద్దేవ చేయవచ్చు. ఒకసారి ఉపయోగం అని తేలాక ఆ బాటను మీ పేరుతోనే శాశ్వతంగా గుర్తుంచుకుంటారు. ఏది ఏమైనా 'అజ్ఞానం - షిర్క్ -కుఫ్'కి ఇష్టమున్నా లేకపోయినా 'విజ్ఞానం - తౌహీద్- ఇస్లాం' ముందు తలవంచి ఓడిపోక తప్పదు. ఈ విషయాన్నే పరమోన్నతుడైన అల్లాహ్ ఇలా తెలియజేస్తున్నాడు:

"వారు (సత్య విరోధులు) తమ నోళ్ళతో (ప్రింటింగ్, ఎలక్ట్రానిక్ మీడియా, ఇతరత్రా ప్రసార, ప్రచార సాధనాల ద్వారా) అల్లాహ్ జ్యోతిని ఊది ఆర్పివేయజూస్తున్నారు. అల్లాహ్ మాత్రం తన జ్యోతిని పరిపూర్ణం చేసి తీరతాడు - అవిశ్వాసులకు, సత్య తిరస్కారులకు అది ఎంత సహించరానిదైనా సరే!"

(అస్సఫ్: 8)

వందల, వేల, లక్షల మంది లాగా ఏ గుర్తింపూ లేకుండా, 'జీవించి ఉండగానే అజ్ఞానుల్లా అనామకంగా మరణించిన వారి'లా జీవించడమా? 'మరణించిన తర్వాత కూడా విజ్ఞుల్లా జీవించి ఉండే వారి' జాబితాలో చేరడానికి ప్రయత్నించడమా? మనమే తేల్చుకోవాలి. ❖

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక






- నూర్ బాషా రహంతుల్లా
విశ్రాంత స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలక్టర్

ప్రపంచంలో మూడు కోట్ల మందికి పైగా ప్రజలు బానిసత్వం లోనే మగ్గుతున్నారు. బానిసలను వెట్టి చాకిరీ నుండి బయట పడేసే ఉద్దేశంతో 1949లో ఐక్యరాజ్యసమితి 'అంతర్జాతీయ బానిసత్వ నిర్మూలన దినోత్సవం' నిర్వహించాలని నిర్ణయిం చింది. బానిసత్వ నిర్మూలన జరగలేదు, కానీ ఏటా డిసెంబర్ రెండో తేదీన ఈ దినోత్సవం జరుగుతుంది. ఎవరికీ ఏమీ అందకుండానే ప్రాణాంతక పురుగుమందులతోనే 'ప్రపంచ నేల దినోత్సవం', 'అంతర్జాతీయ మానవ హక్కుల దినం' జరిపేశారు. బానిసత్వం ఎన్నో రకాలుగా ఉంటుంది. శారీరక మానసిక ఆర్థిక బానిసత్వాలు నిరంతరం చూస్తూనే ఉన్నాం. కులాలు మతాలు బలహీనుల్ని ఏలాయి. బానిసలు నేటికీ కొనసాగుతూనే ఉన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పోరాడే రైతులు వ్యవసాయ బిల్లుల రద్దుకోసం పోరాడారు. ఆందోళన చేస్తున్న రైతుల్ని ఉగ్రవాదులన్నారు, రైతులకు ఉత్పత్తి వ్యయానికి రెండు రెట్లు అధిక ఆదాయాన్ని అందిస్తామని వాగ్దానం చేసిన కేంద్రం ఈ చట్టాల పట్ల రైతుల అభ్యంతరా లేమిటో తెలుసుకోవాలి. భారత ఆహార మార్కెట్‌ను కార్పొరేట్ల పరం చేస్తారేమోననే రైతుల భయాన్ని పోగొట్టాలి. ఆర్థిక అసమానతలు పెరిగి ఉపాధి పడిపోయింది. ఉద్దీపనల వల్ల సామాన్యులకు లాభం జరగాలి. ఉపాధి కల్పనే మాంద్యానికి మందు. విమానాశ్రయాలు, రైల్వేలు, పోర్టులు, బిఎస్ఎన్ఎల్, బ్యాంకులు చివరికి వ్యవసాయాన్ని కూడా కార్పొరేట్లకు అప్పగిస్తే కార్పొరేట్ల ఆస్తితోపాటు పేదలూ పెరుగు తారు. ఆఫ్రికాలోని నీగ్రోలను అమెరికాకు తరలించి బానిసలుగా మార్చి అమ్మారు. బానిసత్వం నేటికీ వెట్టిచాకిరీగా కొనసాగు తోంది.

కరోనాతో ఉపాధి పోయి కొన్ని కోట్లమంది వలస కార్మికుల బతుకులు కుదేలయ్యాయి. ప్రపంచంలో కరోనాతో 17.27 లక్షలమంది ఇండియాలో 1.46 లక్షలమంది చనిపోయారు. మంచి నీళ్ళు త్రాగి ఏలూరులో వందలమంది ఆసుపత్రి పాల య్యారు. బిహార్‌లో మోనోక్రొటోఫాస్ అవశేషాలున్న మధ్యాహ్న భోజనాన్ని తిని పిల్లలు చనిపోయారు. దేశంలో సగం మందికి కూడా వ్యాక్సిన్ ఇవ్వలేమని మూడేళ్లు పడుతుందని భారత్ బయోటెక్ వాళ్ళు అంటున్నారు. జనం చేతిలో కాసులు గలగలలాడేలా ఉపాధి కల్పించాలి. కొనుగోలు సామర్థ్యం పెరిగితే గిరాకీ ఊపందుకొని మాంద్యం తగ్గుతుంది.

వ్యవసాయం రాష్ట్ర ప్రభుత్వ జాబితాలోని అంశం. పంజాబ్, రాజస్థాన్ ప్రభుత్వాలు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా తీర్మానాలు చేశాయి. రైతులను నష్టపరిచే ఎటువంటి చట్టాలనూ తమ రాష్ట్రంలో అమలుచేసేది లేదని కెసిఆర్ ప్రకటించారు. లాభాల కోసం మాత్రమే పనిచేసే కార్పొరేట్ వ్యాపారులు దళారులుగా చేరకపోతే దేశంలో ఎక్కడ మంచి ధర దొరికితే అక్కడికెళ్లి రైతులు తమ పంటలను అమ్ముకో వచ్చుననే చట్టం మంచిదే. కార్పొరేట్ల సంపదతో పాటే దేశంలో పేదరికమూ పెరుగుతోంది. అంబానీ ఆదాయం గంటకు 90కోట్లు కాగా, గ్రామీణ పేదల ఆదాయం నెలకు 5 వేలే. శాస్త్ర, సాంకేతిక రంగాలు ఎంత పురోగమించినా అన్నం పెట్టే రైతులు లేకుండా పూట గడవదు. వ్యవసాయం లేకుండా మానవాళికి బతుకు లేదు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రావటం లేదు. రైతులు అప్పులుపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మరోపక్క అమెజాన్లు, వాల్‌మార్టులు చిన్న చిల్లర దుకాణాలను ఛిద్రం చేసి మరీ ఎదుగుతున్నాయి. ప్రైవేటు బ్యాంకుల ఏర్పాటు బ్యాంకుల జాతీయీకరణ లక్ష్యాలను దెబ్బ తీస్తుంది. ప్రైవేటు బ్యాంకులు తమ బ్యాంకులను ఏర్పాటు చేసిన పెద్ద సంస్థలకు తక్కువ వడ్డీలకు రుణాలిస్తాయి. ప్రైవేటు బ్యాంకులు తిరిగిరాని రుణాలతో దివాళా తీస్తాయి. ప్రజల డిపాజిట్లకు గ్యారంటీ ఉండదు. ముప్పై లక్షల కోట్ల కరోనా ఆత్మనిర్భర ఆర్థిక ప్యాకేజీలు ఇచ్చినా ప్రజల కొనుగోలు శక్తి పెరగలేదు.

పనికొచ్చే చదువులు లేవు. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు కళాసీ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తే రెండు కోట్లమంది నిరుద్యోగులు పోటీపడ్డారు. రైల్వే గేట్‌మెన్, అసిస్టెంట్, గ్యాంగ్‌మెన్ ఉద్యోగాలకు 82 లక్షల మంది పట్టభద్రులు బారులు తీరారు. పనిమంతులు దొరకట్లేదని కార్పొరేట్లు, పనే దొరకట్లేదని పట్టభద్రులూ బాధపడుతున్నారు. ఉపాధి కల్పించలేని చదువుల కోసం విద్యా రుణాలు మాత్రం ఇస్తున్నారు. మానవాభివృద్ధి సూచీల్లో చైనా 85వ స్థానంలో ఉంటే ఇండియా 131 వ స్థానంలో ఉంది. ప్రపంచ భూమిలో ఇండియాకు 2.4శాతం ఉంటే జనాభా 16శాతం ఉంది. సంతానోత్పత్తి పెరుగుతూ జనసంఖ్య చైనాను దాటేలా ఉంది. మన దేశంలో సగటు ఆయుర్దాయం 69.7 సంవత్సరాలు ఉంటే బంగ్లాదేశ్(72.6), నేపాల్(70.8), భూటాన్ (71.8). పదివేల జనాభాకు మన దేశంలో వైద్యులు 9 మంది మాత్రమే. వైద్య కళాశాలల్లో సీట్లు చాలక మన విద్యార్థులు చైనా, రష్యా, ఫిలిప్పీన్స్ దేశాలకు వలస పోతు న్నారు. వైద్య విద్య ఖర్చు భరించలేని ప్రజలతో వైద్యుల సంఖ్య, ఆసుపత్రి సదుపాయాలు ఎలా పెరుగుతాయి. గిరిజన జనాభా ఎనిమిది శాతం ఉన్నప్పటికీ టీచర్లలో వారు 3 శాతవే. జనాభాకు తగినట్లు మొత్తం 1500 విశ్వవిద్యాలయాలు కావాల్సి ఉండగా 993 మాత్రమే ఉన్నాయి. దాదాపు కోటి మంది ఏటా వృత్తి ఉపాధి నైపుణ్యం లేని డిగ్రీలు, రెండు లక్షల మంది ఎంఫిల్, పిహెచ్‌డిలు పొందుతున్నారు. విద్య మీద పెట్టుబడిలో ప్రపంచంలో అమెరికా 27, చైనా 44, సూడాన్ 157, ఇండియా 158, నమీబియా 159వ స్థానాల్లో ఉన్నాయి. 117 దేశాల ప్రపంచ ఆకలి సూచిక జాబితాలో శ్రీలంక 66, నేపాల్ 73, బంగ్లా 88, పాకిస్తాన్ 94, ఇండియా 102, ఆఫ్ఘనిస్తాన్ 108వ స్థానాల్లో ఉన్నాయి. ఆయుష్మాన్ భారత్ ఉన్నప్పటికీ ప్రైవేటు ఆసుపత్రుల్లో భరించలేని ఖర్చుతో ప్రజలు అప్పులపాలౌతున్నారు. ప్రపంచ సంతోష సూచికలో మన దేశం 133 నుంచి 140కి దిగజారింది. ఢిల్లీలో కుక్కలకు కూడా దహనవాటిక ఏర్పాటు చేశారట. మనిషి ఎంత ధనికుడై బ్రతికినా చివరికి సమాధికి చేరాల్సిందే. కొన్ని చోట్ల సంపన్నులు తమ శ్మశానాలను స్వర్గ పురాలుగా శుభ్రంగా అందంగా మార్చుకుంటున్నారు. పేద కులాలకు చాలా చోట్ల శ్మశానాలే లేవు. శ్మశానాలు ఉన్నా సరైన దారిలేక శవాలను మోస్తూ మరుభూమికి చేరవేయటానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. దారి పక్క రోడ్డు, డొంక, కాల్వ పోరంబోకు స్థలాలలోనే అంత్యక్రియలు కానిచ్చేస్తున్నారు. శ్మశానాల ఏర్పాటూ సంక్షేమ కార్యక్రమమే కాబట్టి ప్రభుత్వాలు దృష్టి సారించాలి.

అంటరానితనం నిషేధమైనా ఇప్పటికీ అనేక రూపాల్లో ప్రబలిపోతోంది. ఆడవారిని హింస, బలవంతం, మోసాలు చేసి శ్రమదోపిడి చేస్తున్నారు. అప్పులిచ్చి బానిసలుగా మార్చి లైంగిక దోపిడి చేస్తున్నారు. పిల్లలను చదివించకుండా జీతానికి పనుల్లో పెడుతున్నారు. బలవంతపు పెళ్ళిళ్లు, బాల్య వివాహాలు చేస్తున్నారు. ఈ తప్పుడు పనులన్నీ బానిసత్వమే. అక్రమంగా రవాణా చేసి బలవంతంగా వ్యభిచారంలోకి దించుతున్నారు. కులాంతర వివాహాలకు వ్యతిరేకులు పరువు హత్యలు

చేస్తున్నారు. బాల్య వివాహాలు ఆపటానికి మహిళలకు వివాహ వయస్సును 18 ఏళ్లు, పురుషులకు 21 ఏళ్లుగా పెంచారు. ప్రపంచంలో బాలికా వధువులు భారత్‌లోనే ఎక్కువ. సంప్రదాయాలు, సామాజిక ఆచారాలు పేరు చెప్పి కుమార్తె రజస్వల అయితే చాలు పెళ్ళి చేస్తున్నారు. 15-19 ఏళ్ల ప్రాయంలోనే బాలికా వధువులు తల్లులవుతున్నారు. 18 ఏళ్లకు ముందే వివాహ మాడుతున్న బాలికల సంఖ్య 36 శాతం దాకా ఉంది. మహిళలపై లైంగిక హింస జరుగుతోంది. మహిళలు మగవారిపై ఆధారపడి, వారికి బానిసలుగా ఉంటున్నారు. చిన్న వయసులోనే పెళ్లి చేయడం వల్ల భార్యగా, తల్లిగా, కోడలిగా బరువైన బాధ్యతలు స్వీకరించి మైనర్ బాలికలు ఒంటరితనానికి, కుంగుబాటుకు గురౌతున్నారు. మహిళలకు సమాన చదువు ఆస్తి హక్కు కావాలని జ్యోతిబా పూలే, గురజాడ, కందుకూరి, పెరియార్ రామస్వామి, అంబేద్కర్, నారాయణ గురు లాంటి వారు చేసిన పోరాటాల ఫలితంగా మహిళలకు కొన్ని హక్కులు వచ్చాయి. ప్రతి కుటుంబానికీ సొంత ఇల్లు అనే పాత వాగ్దానం ప్రకారం స్వగృహ, టిడ్కో, ఆత్మనిర్భర్ భారత్, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన లాంటి ఎన్నో పథకాల కింద కోట్ల ఇళ్ళు మంజూరవుతున్నాయి. కానీ ఇల్లులేని వారి సంఖ్య ప్రతి జనాభా లెక్కల్లో పెరుగుతూనే ఉంది. ఇంకా పట్టణ ప్రాంతాల్లో 1.12 కోట్ల ఇళ్లకు గిరాకీ ఉందట. ఇల్లు కట్టి చూడు,పెళ్లి చేసిచూడు అన్నారు. ఇల్లు లేకపోయినా పెళ్లి చేసుకున్నవారి ఆవేదన తగ్గాలి. ఇళ్ళు అందుబాటు ధరల్లో లేవు. పేదల ఇళ్లకోసం సరైనచోట భూమి దొరకక ఆవ భూముల్లో ఇళ్ల స్థలాలు పంచుతున్నారు. వాటిని మెరకచేసి ఇళ్ళు కట్టాలి. లేదా అపార్ట్‌మెంట్లు కట్టి ప్లాటు ఇవ్వాలి. ఇళ్ల పథకాలు జాప్యం లేకుండా పూర్తి చేయాలి. భూమి ధర రోజురోజుకూ పెరిగి ఆలస్యం వల్ల నిర్మాణ వ్యయాలు పెరుగుతాయి. జగన్ ప్రభుత్వం మహిళల పేరుతో 30.76 లక్షల కుటుంబాలకు ఇంటి పట్టాలు 2.62 లక్షల టిడ్కో ఇళ్ళు ఇవ్వటం హర్షదాయకం. తెలంగాణాలో డబల్ బెడ్ రూమ్ అపార్ట్‌మెంట్లు కట్టించి పేదకుటుంబాలకు ఇవ్వటం పేదల ఆదాయాన్ని పెంచి వారికి ఆర్థిక భద్రతనిస్తుంది. కుటుంబాల ఆర్థిక భద్రత పెరిగినప్పుడు అప్పులు తగ్గి రక్షణ పెరుగుతుంది. వివక్ష అణచివేత హింస బానిసత్వం తగ్గుతాయి. ❖

# మీ సేవలకు సలామ్...



నగరం నిద్రపోతున్న వేళ మీరు మేల్కొంటారు.. హుటాహుటిన పనిప్రాంతానికి చేరుకుంటారు.. చీపురు చేతపట్టుకుని మా బస్తీలను శుభ్రం చేస్తారు. దుర్వాసనను భరించి మేం నడిచే దారులను అద్దంలా తీర్చిదిద్దుతారు. కష్టమైన పనిని ఇష్టంగా చేస్తున్న మీ సేవలను వెలకట్టలేము... చలికి తోడు కరోనా పంజా విసురుతున్న వేళ మీరు చూపిస్తున్న ఈ తెగువకు మా సలాములు అంటూ పారిశుద్ధ్యకార్మికులకు మఫ్లర్లు, బ్లాంకెట్లు అందజేశారు నసీమ్ సుల్తానా. హైదరాబాద్ సెవెన్ టోంబ్స్ రోడ్డులో తెల్లవారు ఝామున ఆమె తన బృందంతో కలిసి పారిశుద్ధ్య కార్మికులకు మఫ్లర్లు, బ్లాంకెట్లు అందజేశారు. నసీమ్ సుల్తానా జమాఅతె ఇస్లామీహింద్ టోలీచౌకీ మహిళా విభాగం నాయకురాలు. డిసెంబర్ నెలలో చలి సీజన్ మొదలైనప్పటినుంచి ఆమె టోలీచౌకీ ప్రాంతంలోని పలు చోట్ల బ్లాంకెట్లు, మఫ్లర్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. గజగజ వణికే చలిలోనూ ఎంతోమంది వృద్ధులు తెల్లవారుఝామున పారిశుద్ధ్య పనులు చేయడం చూసి తాను చలించిపోయానని, అలాంటి వారికి సేవచేయడం దైవానికి సేవచేయడమేనని ఆమె అన్నారు. జమాఅతె ఇస్లామీహింద్ మహిళా విభాగం ఆధ్వర్యంలో తాము చేపట్టే సామాజిక సేవా కార్యక్రమాలకు చక్కని స్పందన వస్తోందని ఆ సంస్థ నగర నాయకురాలు ఆయిషా సుల్తానా అన్నారు.



- పోలంకి విజయభాస్కర్

# నైతిక విలువలను పాఠ్యాంశాలుగా బోధించాలి


**ఎడ్యుకేషన్...** ఎడ్యూస్ అనే పదం నుండి వచ్చింది. అంటే బయటకు తీయడం అని అర్థం. విద్యార్థిలో దాగివున్న ప్రతిభా పాటవాలను బయటకు తీయడం. విద్య వల్ల లోకజ్ఞానం, వ్యవహార దక్షత, వినయం, వినమ్రత, ధర్మం, ధనం ఇత్యాధులను పొంది మనిషి సుఖపడతాడు. ఈ విద్య అనంతం. మనిషికి అమూల్యమైన సంపద, ఇతరులచే తస్కరించబడనిది. ప్రతి మనిషి ఒడిదుడుకులు లేని ప్రశాంత జీవనం చేయాలంటే కనీస విద్య అవసరం. విద్య దేవుణ్ణి గుర్తించేలా చేస్తుంది. మానవత్వాన్ని గ్రహించేలా చేస్తుంది. సత్యాసత్యాల విచక్షణ నేర్పుతుంది.

విద్యాజ్ఞానం లేకుండా ఏ మహత్కార్యాన్ని సాధించలేము. ధైర్య సాహసాలు, శక్తి సామర్థ్యాలు విద్య వల్లే జనిస్తాయి. విద్యార్థి దశ మానవ జీవితంలో అతి కీలకమయిన మలుపు వంటిది. విద్యార్జనా ఉద్దేశ్యం మనిషిని నీతిమంతుడుగా చేయాలన్నదే. విజ్ఞాన దాయకం, వివేకభరితమయిన మాట ఏ నోట విన్నా, ఏ చోట గ్రహించినా తక్షణం దాన్ని స్వీకరించడం, తన సొంతం చేసుకోవడం విజ్ఞుడయిన వ్యక్తి లక్షణం. ఎందువల్లనంటే విజ్ఞానం, వివేకం అన్నది మన ఉమ్మడి సొత్తు. మనిషి దాన్ని ఎప్పుడు గ్రహించినా తాను ఎన్నడో కోల్పోయిన సొత్తుగా భావించి దాన్ని తన హృదయానికి హత్తుకోవాలి. విజ్ఞుడయినవాడే అలా చేస్తాడు. ఎవరు చెప్పారన్నది కాకుండా ఏమి చెప్పారన్న విషయానికి ప్రాధాన్యతనివ్వాలి.

కొందరు జీవన భృతి కోసమయితే ఎంత కష్టపడయినా సరే చదివి డిగ్రీలు పొందుతున్నారు. వారు తమ చదువులకు తగిన ఉద్యోగాలు చేసి ఎక్కువ డబ్బు సంపాదించడానికి ఉన్నత చదువులు చదువుతారు. ప్రమోషన్ల కోసం ప్రత్యేక పరీక్షలు రాసి డబ్బు, హొదా, అంతస్తుల వ్యామోహంలో పడుతున్నారు. కాని పరలోక సాఫల్యం కోసం మాత్రం ధార్మిక విద్య నేర్చుకోవడానికి ప్రయత్నించరు. దైవం పట్ల విశ్వాసమే గనక ఉంటే.. ప్రతి విశ్వాసి ఎలాగయినా సరే కొంత సమయం తీసి దైవగ్రంథాన్ని చదవడానికి, నేర్చుకోవడానికి ప్రయత్నించాలి.

### తొలి గురువులు తల్లిదండ్రులు, మలి గురువులు ఉపాధ్యాయులు

పిల్లలు పుట్టిన దగ్గర్నుంచి వారు ఏ కోర్సు చదివితే మంచి ఉద్యోగం వస్తుంది.. మంచి ఆదాయం వస్తుంది అనే ఆలోచనల లోనే తల్లిదండ్రులు మునిగి తేలుతున్నారు. అంతేగాకుండా ఎల్లప్పుడూ సైన్స్, గణిత శాస్త్రం తప్ప మిగతా సబ్జెక్టుల గురించి సంభాషణే ఉండదు ఇంట్లో. ఎందుకంటే ఈ సబ్జెక్టులు మాత్రమే భవిష్యత్తులో తమ పిల్లలకు మంచి జీవితాన్ని ప్రసాదిస్తాయి అనే ఆలోచనల్లో పూర్తిగా తల్లిదండ్రులున్నారు. ఏ ఒక్కరోజు కూడా ఈ సమాజం కోసం ఎలా బ్రతకాలి, ఈ జీవితానికి పరమార్థమేమిటి అనే వాటి ప్రస్తావన పిల్లల ముందుంచడం లేదు. నేటి ఉపాధ్యాయులు కూడా భావి పౌరులను తయారు చేయడం ఒక బాధ్యతగా తీసుకోవాలి. మనుష్యులను మాన్యులుగా చేయగలిగే నీతి శాస్త్రాలను పాఠ్యాంశాలలో చేర్చాలి. మన గ్రంథాలలోని నైతిక విలువలను చాటే నీతి కథల గురించి చెప్పే ప్రయత్నం చెయ్యాలి. ❖




– డాక్టర్ ఎన్. ఖలీల్

కరోనా మహమ్మారిని తరిమికొట్టే వ్యాక్సిన్ కోసం ప్రపంచ వ్యాప్తంగా పరుగులు వేగం పుంజుకున్నాయి. ఈ పరుగుల వెనుక రకరకాల ప్రయోజనాలు కనిపిస్తున్నాయి. కొన్ని దేశాలు ప్రజారోగ్యం కాపాడాలన్న ఆతృతతో పరుగు తీస్తుంటే బహుళజాతి కంపెనీలు లాభాల కోసం, ప్రజారోగ్యం గాలికొదిలేసిన ట్రంప్, మోడీ, బోల్సనారో వంటి మితవాద ప్రభుత్వాలు పోయిన పరువు కాపాడుకోడానికి ఈ పని చేస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లోకి ఏ బహుళజాతి మందుల కంపెనీ ముందుగా అడుగు పెడితే దానికే భారీ లాభాలు పోగు చేసుకునే అవకాశం దక్కుతుంది. స్టాక్ మార్కెట్లో దాని విలువ అమాంతం పెరుగుతుంది. కనుక మీడియాలో ఈ కంపెనీల ప్రచారార్భాటం చాలా ఎక్కువగా కనిపిస్తోంది. ఈ ప్రచారంలో వాస్తవాలు చాలా వరకు మరుగున పడిపోతున్నాయి.

గత జనవరిలో చైనా శాస్త్రవేత్తలు కోవిడ్-19 (SARS COV-2) వైరస్ యొక్క జనిటిక్ కోడ్‌ను లేక జీనోమ్‌ను ఛేదించి ఇంటర్నెట్లో పెట్టడంతోనే వ్యాక్సిన్ తయారీ ప్రయత్నాలు ముమ్మరమైనాయి. మామూలుగా అయితే ఒక సురక్షితమైన, సమర్ధవంతమైన వ్యాక్సిన్ తయారు చేయడానికి దశాబ్దాలు పడుతుంది. కానీ పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం ఒక్క ఏడాది కాలంలోనే వ్యాక్సిన్ రూపొందించే అవకాశాలు కల్పించింది. అందువల్ల వచ్చే ఏడాది వేసవి నాటికి వ్యాక్సిన్‌ను బయటకు తెచ్చేందుకు శాస్త్రవేత్తలు తీవ్రంగా కృషి చేస్తున్నారు. కానీ ఈలోగా కోవిడ్ ప్రమాదం మరింత పెరగడంతోపాటు బహుళజాతి కంపెనీల పోటీ, అంతర్జాతీయ రాజకీయ వ్యూహ ప్రతివ్యూహాల వల్ల పరీక్షలు పూర్తికాక ముందే అంటే మూడవ దశ క్లినికల్ పరీక్షలు జరుగుతుండగానే అత్యవసర వినియోగం కింద వ్యాక్సిన్ మార్కెట్‌లోకి వచ్చేసింది. చైనా, రష్యా, బ్రిటన్, అమెరికా, యుఎఇ వంటి దేశాల్లో పెద్ద ఎత్తున ప్రజలకు వ్యాక్సిన్ ఇవ్వడం ప్రారంభమైపోయింది.

ప్రపంచ వ్యాప్తంగా శాస్త్రవేత్తలు 200కు పైగా వ్యాక్సిన్లను అభివృద్ధి చేశారు. వాటిలో సుమారు 50 వ్యాక్సిన్లు క్లినికల్ పరీక్షల్లో ఉన్నాయి. మరో 150 వ్యాక్సిన్లు వివిధ అభివృద్ధి దశల్లో అంటే లాబొరేటరీ, జంతువులపై పరీక్షల దశల్లో ఉన్నాయి. వివిధ దేశాల్లో 9 వ్యాక్సిన్లను అత్యవసర అనుమతి పొంది ప్రజలకు ఇస్తున్నారు. వీటిలో చైనాకు చెందిన 4, రష్యాకు చెందిన 2, అమెరికా, బ్రిటన్ బహుళజాతి సంస్థలకు చెందిన 3 వ్యాక్సిన్లు అత్యవసర అనుమతులు పొందాయి. భారత్‌కు చెందిన కోవ్యాక్సిన్ల అనుమతుల కోసం వేచి చూస్తున్నది. అమెరికా, బ్రిటిష్, రష్యా వ్యాక్సిన్లను మన దేశంలో రెడ్డి ల్యాబ్స్, సీరమ్ ఇన్సిటి

ట్యూట్ ఆఫ్ ఇండియా వంటి ప్రయివేటు కంపెనీలు ఉత్పత్తి చేస్తు న్నాయి. అనేక దేశాలకు చెందిన ఇంకో 40 వరకు వ్యాక్సిన్లు 1 నుండి 3వ దశ వరకు క్లినికల్ పరీక్షల్లో వున్నాయి. వచ్చే ఏడాది ప్రథమార్థం ముగిసేసరికి వీటిలో చాలా వ్యాక్సిన్లకు అత్యవసర అనుమతులు లభించవచ్చు.

అత్యవసర అనుమతి అంటే ఏమిటి? మామూలుగా అయితే మూడవది, చివరిది అయిన దశలో పెద్ద సంఖ్యలో విభిన్న తరహా ప్రజలకు వ్యాక్సిన్ ఇచ్చి సహజ వాతావరణంలో వారిలో ఇమ్యూనిటీ ఎలా తయారవుతుందో పరీక్షిస్తారు. విశ్లేషిస్తారు. వ్యాక్సిన్ 100 శాతం సురక్షితంగా, సమర్థవంతంగా ఉందని నిర్ధారించుకున్నాక ప్రజలకు ఇవ్వడం మొదలు పెడతారు. కానీ కొన్ని అత్యవసర సమయాల్లో 3వ దశ పరీక్షలు ముగియక ముందే, విశ్లేషణలు జరపక ముందే 1.2 దశల పరీక్షల ఫలితాల ఆధారంగా వ్యాక్సిన్ ఇవ్వొచ్చు. ఇప్పుడు దాదాపు అన్ని దేశాలూ ఈ సడలింపులను ఇచ్చి పెద్ద ఎత్తున వ్యాక్సిన్ కార్యక్రమాలు ప్రారంభిస్తున్నాయి. అంటే ఒక రకంగా మూడవ దశ వ్యాక్సిన్ ప్రయోగాలు ప్రజల మీద నేరుగా జరుపుతున్నట్టే.

చైనా, భారత్‌లో కరోనా వ్యాక్సిన్‌ను సంప్రదాయ పద్ధతిలో అంటే రసాయనాలతో నిర్వీర్యం గావించబడిన వైరస్‌లను వ్యాక్సిన్ల రూపంలో మనుషుల శరీరంలోకి ఎక్కించడం ద్వారా వారిలో ఇమ్యూనిటీని పెంచే పద్ధతిలో తయారు చేస్తున్నాయి. ఈ వ్యాక్సిన్లను నిల్వ చేయడానికి 2 నుండి 7 సె.డిగ్రీల ఉష్ణోగ్రత కలిగిన మామూలు రిఫ్రిజిరేటర్లు సరిపోతాయి. అందువల్ల ఈ వ్యాక్సిన్ రవాణా చేయడం, ప్రజలకు ఇవ్వడం సులభం. కానీ బ్రిటన్, అమెరికా ఇతర కొన్ని యూరోపియన్ సంస్థలు ఆర్ఎన్ఎ ఆధారంగా కొత్త పద్ధతిలో వ్యాక్సిన్ ఉత్పత్తి చేస్తున్నాయి. ఈ వ్యాక్సిన్ నిల్వ చేయాలంటే -70 సె.డిగ్రీ ఉష్ణోగ్రతలు గలిగిన అత్యంత శీతల రిఫ్రిజిరేటర్లు కావాలి. ఈ రిఫ్రిజిరేటర్ల ఖరీదు, నిర్వహణ వ్యయం ఎక్కువ. రవాణా చేయడం, సిబ్బంది వాటిని వినియోగించడం రిస్కుతో కూడిన పని. అందువల్ల చైనా, భారత్‌లు ఉత్పత్తి చేసే వ్యాక్సిన్లు పేద దేశాలకు అనుకూలంగా ఉంటాయి.

వ్యాక్సిన్ ఉత్పత్తి, పంపిణీ విషయంలో అమెరికా చైనాల ధోరణుల్లో చాలా వ్యత్యాసం కనిపిస్తోంది. డొనాల్డ్ ట్రంప్ మితవాద ప్రభుత్వం వ్యాక్సిన్ విషయంలో కూడా "అమెరికా ఫస్ట్" అనే వైఖరి తీసుకున్నది. బహుళజాతి ఔషధ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుని మొదటి 30 కోట్ల డోసులకు పైగా వ్యాక్సిన్ను ముందు గానే కొనేసింది. ఐరోపాకు చెందిన అనేక ధనిక దేశాలు కూడా ఇదే పద్ధతిలో మార్కెట్లో కొనుగోలుకు ఒప్పందాలు చేసుకు న్నాయి. వ్యాక్సిన్‌ను ప్రజలకు ప్రాధాన్యతా క్రమంలో ఇవ్వాలనీ, పేద దేశాల సంగతి పట్టించుకోవాలనీ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) చేసిన విజ్ఞప్తులను అవి పెడచెవిన పెట్టాయి. ట్రంప్ గత ఎన్నికల్లో గెలవడానికి కరోనా వ్యాక్సిన్ను ఒక రాజకీయ సాధనంగా వాడుకోడానికి ప్రయత్నించారు. ఎన్నికలకు ముందు గానే దేశ ప్రజలందరికీ వ్యాక్సిన్ అందజేస్తున్నట్లు ప్రకటించారు (బీహార్ ఎన్నికల్లో మోడీ ప్రభుత్వం కూడా ఇటువంటి ప్రచారమే చేసింది). వ్యాక్సిన్ విషయంలో అమెరికాగానీ, ధనిక యూరప్ దేశాలుగానీ పేద దేశాల విషయమే పట్టించుకోలేదు. డబ్ల్యుహెచ్ఓ మాత్రం పేద దేశాలకు సుమారు 200 కోట్ల డోసుల వ్యాక్సిన్ అందించేందుకు దాతల నుండి డబ్బు పోగుచేసింది.

చైనా వైఖరి పశ్చిమ దేశాల వైఖరికి భిన్నంగా ఉంది. చైనా తయారు చేసిన కోవిడ్ వ్యాక్సిన్ 'ప్రపంచ ప్రజల సంక్షేమానికి' ఉపయోగి స్తామని, వ్యాక్సిన్ "వర్ధమాన దేశాల ప్రజలకు సరసమైన ధరలకు అందుబాటులో ఉంటేట్లు" చూస్తామని చైనా అధ్యక్షుడు సి జిన్పింగ్ గత మే నెలలో డబ్ల్యుహెచ్ఓ వార్షిక సమావేశంలో మాట్లాడుతూ చెప్పారు. ఈ హామీకి అనుగుణంగానే చైనా నేడు ప్రపంచంలోని దాదాపు 100 దేశాలకు ముఖ్యంగా ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికాలోని పేద దేశాలకు వ్యాక్సిన్ పంపిస్తోంది. గత జూన్‌లోనే చైనా లోని రెండు వ్యాక్సిన్లు సినోవాక్, సినోఫామ్లకు ప్రభుత్వం అత్యవసర అనుమతులు మంజూరు చేసింది. దాదాపు 10 లక్షల మంది చైనీయులు ముఖ్యంగా దేశంలోని ఇతర ప్రాంతాలకు ఉద్యోగ వ్యాపారాల కోసం వెళ్లేవారు, విదేశాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు వ్యాక్సిన్ వేసుకున్నారు. దేశంలో కరోనా వ్యాప్తిని మొదట్లోనే కట్టడి చేసిన


పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

చైనాకు వ్యాక్సిన్ అత్యవసరం కాకపోయినప్పటికీ ప్రపంచ దేశాలకు దాన్ని సరఫరా చేస్తోంది. దాని కోసం షెంజన్ నగరంలో ఒక పెద్ద గోదాము నిర్మించింది. ఆఫ్రికాలోని దాదాపు 40కి పైగా దేశాలకూ, కాంబోడియా, మయన్మార్, లావోస్, థారులాండ్, వియత్నాం, అఫ్ఘానిస్తాన్, మలేషియా, బంగ్లాదేశ్, పాకిస్తాన్, యుఎఇ, బ్రెజిల్, ఇతర అనేక లాటిన్ అమెరికా దేశాలకు చైనా వ్యాక్సిన్ సరఫరా అవుతోంది. వీటిలో పలు దేశాలకు ఉచితంగా అందిస్తోంది. ఈ వ్యాక్సిన్ మామూలు ఫ్రిజ్లలో రవాణా చేయవచ్చు గనుక పేద దేశాలకు అనుకూలంగా ఉంది. చైనా ప్రారంభించిన బెల్ట్, రోడ్ ప్రాజెక్టులో వున్న దేశాలన్నిటికీ అది వ్యాక్సిన్ సరఫరా చేస్తోంది. అందుకే దాన్ని 'ఆరోగ్య సిల్క్ రోడ్' అంటున్నారు. దీంతోపాటు పేద దేశాలు కరోనాపై పోరాడ్డానికి రానున్న రెండేళ్లలో 200 కోట్ల డాలర్లు (సుమారు రూ.15,000 కోట్లు) సహాయం చేస్తామని, కరోనా వ్యాక్సిన్ కొనుగోలు చేయడానికి లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాలకు సుమారు రూ. 7500 కోట్లు రుణం ఇస్తామని చైనా అధ్యక్షుడు ప్రకటించారు.

మన దేశంలో ప్రభుత్వ రంగ సంస్థ అయిన భారత వైద్య పరిశోధనా మండలి (ఐసిఎంఆర్), ప్రయివేటు సంస్థ అయిన భారత్ బయోటెక్ కలిసి ఉత్పత్తి చేసిన దేశవాళీ "కోవ్యాక్సిన్" మూడవ దశ క్లినికల్ పరీక్షలు జరుపుకుంటూ ప్రభుత్వం నుండి (డ్రగ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా నుండి) అత్యవసర అనుమతి కోసం ఎదురు చూస్తోంది. ప్రస్తుతం దేశ వ్యాపితంగా 26,000 మంది మీద ఈ వ్యాక్సిన్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇంకా ఒకటి రెండు దేశవాళీ వాక్సిన్లు క్లినికల్ పరీక్షల్లో వున్నాయి. ఇవి వచ్చే ఏడాది మధ్యకు పూర్తికావచ్చు. భారత దేశంలో తయారయ్యే ఈ వ్యాక్సిన్లను మామూలు ఫ్రిజ్లలో రవాణా చేయవచ్చు గనుక ఖర్చు, ప్రయాస తక్కువ. కానీ మన దేశానికి చెందిన ప్రయివేటు సంస్థలు బ్రిటన్‌కు చెందిన ఆక్స్‌ఫర్డ్, ఫైజర్, మోడెర్నా తదితర బహుళ జాతి సంస్థలతో కలిసి దేశంలోనే వ్యాక్సిన్ డోస్లను ఉత్పత్తి చేస్తున్నాయి. ఈ వ్యాక్సిన్లను వచ్చే నెల నుండి అత్యవసర గ్రూపులకు పంపిణీ చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ వ్యాక్సిన్లను -70 సె.డిగ్రీల వద్ద వుంచడం, రవాణా, పంపిణీ చాలా సంక్లిష్టమైన విషయం గనుక దీనిపై దేశవ్యాపితంగా సిబ్బందికి పెద్ద ఎత్తున శిక్షణ ఇస్తోంది.

కొనుగోలు చేయగల వినియోగదారులకు బహుళజాతి సంస్థల వ్యాక్సిన్లు వచ్చే ఏడాది నుండి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దాంతో డబ్బున్న వారు దీన్ని కొనుగోలు చేస్తారు. పేద ప్రజలు ప్రభుత్వాల మీదనే ఆధారపడాలి. వ్యాక్సిన్లు అన్ని దేశాల్లోని ప్రజలందరికీ అందాలంటే రెండేళ్లు పట్టే అవకాశం ఉంది. మన దేశంలో 25 శాతం మందికి వచ్చే ఏడాది పూర్తయినా వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చే అవకాశం లేదంటున్నారు. అసమానతలతో కూడిన ప్రపంచంలో పేదలు ఎప్పుడూ చివరి లోనే ఉంటారు. ❖


## హైదరాబాద్ పాతబస్తీ సైంటిస్టుకు అరుదైన గౌరవం



హైదరాబాద్ పాతబస్తీకు చెందిన ఓ సైంటిస్టు అరుదైన గౌరవం దక్కించుకున్నాడు. స్టాండ్‌ఫర్డ్ యూనివర్శిటీ ప్రపంచ స్థాయి సైంటిస్టుల జాబితాను రూపొందించింది. ఆ జాబితాలో హైదరాబాద్ పాతబస్తీ వాసి డాక్టర్ రఫీఉద్దీన్ ఆ జాబితాలో చోటుదక్కించుకున్నారు. మాతృభాష ఉర్దూలో చదివి అంతర్జాతీయ స్థాయి సైంటిస్టుగా ఎదగడం పట్ల పలువురు ముస్లిమ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్ జెఎన్టీయూలో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి బిర్లా ఇనిస్టిట్యూట్ నుంచి మాస్టర్ డిగ్రీ చేశారు. దక్షిణ కొరియా, జపాన్, న్యూజీలాండ్ దేశాల్లోని పలు యూనివర్శిటీల్లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పాఠాలు చెబుతున్నారు. అంతర్జాతీయ పత్రికల్లో ఆయన పరిశోధనాత్మక వ్యాసాలు ప్రచురితమయ్యాయి. అంతర్జాతీయ స్థాయి సైంటిస్టుల జాబితాలో రఫీయుద్దీన్ అహ్మద్ చోటు సంపాదించడం పట్ల ఆయన తమ్ముడు హైదరాబాద్ నగర జమాఅతె ఇస్లామీహింద్ అధ్యక్షులు హాఫిజ్ రషాదుద్దీన్ హర్షం వ్యక్తం చేశారు. మాతృభాషలో చదువులను చిన్నచూపు చేసే నేటితరానికి రఫీయుద్దీన్ సాధించిన విజయం చెంపపెట్టు.

కథ

అబ్దుల్ బాసిత్. కొత్త గూడెం



# చేసిన పుణ్యం తిరిగొచ్చింది

ఉదయాన్నే, మా వారితో కలిసి వరండాలో కూర్చుని ఆఫీస్ విషయాలు మాట్లాడుకుంటున్న సందర్భంలో మాసిపోయిన చీర, సంకలో ఒక పాపను ఎత్తుకుని గేటు ముందు దీనంగా నిలబడి “అమ్మగారండీ” అని పిలిచిందొకావిడ. ఇంట్లో మార్నింగ్ చేసిన టిఫిన్ తెచ్చి ఇవ్వబోయాను. “క్షమించాలి నేను బిచ్చగత్తెను కాదండీ. అమ్మ నాన్న చిన్నప్పుడే పోయారు. అమ్మమ్మ పెంచి పెళ్లి చేసింది. నా తలరాత బాగోలేదనుకుంటా. అనారోగ్యంతో నన్ను, పాపను అనాథను చేసి ఆయన కూడా లోకం వీడి వెళ్లి పోయారు. ఏదైనా పని ఉంటే చెప్పండమ్మా, నాకు, నా బిడ్డకు ఇంత తిండి పెట్టి, తల దాచుకోవడానికి ఇంత చోటు ఇస్తే చాలు. ఏ పని అయినా చేస్తాను. పని మీకు నచ్చకపోతే పంపించి వేయండి’ అని ప్రాధేయపడింది. ఆమె మాటలు నన్ను కదిలించాయి. ఎంతగానో చలించిపోయాను. ఆ మరుక్షణమే పనిలో పెట్టుకున్నాను. జీతభత్యాలు అన్నీ మాట్లాడుకున్నాము. పనులన్నీ చక్కగా చేసేది. అమ్మాయిని నేను చదువు చెప్పే బడిలోనే జాయిన్ చేసి నా వెంటే స్కూల్‌కు తీసుకెళ్లేదాన్ని. మేము వచ్చేసరికి ఇంటి పని, వంట పని శుభ్రంగా చేసి పెట్టేది. కాలం గిర్రున తిరిగింది. మా పిల్లలు ఉన్నత చదువులు చదివి పెళ్ళిళ్ళు చేసుకుని పెట్టే బేడ సర్దుకుని విదేశాలకు వెళ్లి స్థిరపడి పోయారు. ఆ పని మనిషి కూతురు కూడా చదువుల్లో చాలా చురుకుగా ఉండేది. ఎంబీబీఎస్‌లో ఫ్రీ సీటు సాధించింది. ఆ తరువాత డాక్టర్‌గా పేరు తెచ్చుకుంది. ఆమెతోపాటు చదువుకున్న ఒక అబ్బాయి ఆ అమ్మాయి గుణాలు నచ్చి ఏరికోరి పెళ్ళి చేసుకున్నాడు. ఎందుకు చేసుకోడూ? చదువుల్లో, మంచితనంలో, గుణగణాల్లో ఎందులోనూ తక్కువకాదు. ఆమె ఒక రోజు తల్లితో “ఇన్ని రోజులు నువ్వు నా కోసం కష్టపడింది చాలు. దేవుని దయవల్ల మేము ఇద్దరం బాగానే సంపాదిస్తున్నాం. మనం వేరే ఇల్లు చూసుకొని వెళ్లిపోదాం” అని అంది. “పిచ్చిదానా! మనకంటూ ఎవరూ లేనప్పుడు ఇంత నీడను ఇచ్చిన వాళ్లను వదిలి వెళదామా? మనం ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నామంటే వీళ్ల వల్లే కదా అన్న విషయాన్ని మరచి పోవడమంటే నమ్మకద్రోహమే అవుతుంది” అని చిన్నపాటి లెక్చరే ఇచ్చింది. కన్నపిల్లలు ఎలాగూ అనాథలుగా చేసి వారి మానాన వారు వెళ్లిపోయారు. మనం కూడా వెళ్లిపోతే ఇక వాళ్లకు దిక్కెవరు.’ అని ఒకింత ఉద్వేగానికి లోనయింది. తల్లి మాటలకు కూతురు సిగ్గుపడింది. తనను క్షమించమని ప్రాధేయపడింది. ఇక ఎప్పుడూ ఇలా మాట్లాడనని చెప్పింది. తల్లీ కూతుళ్ల సంభాషణను విన్న ఆమె భర్త కూడా వారికి మద్దతుగా నిలబడ్డాడు. మీ నిర్ణయమే నా నిర్ణయమని చెప్పాడు. “ఆనాడు మీరు ఎవరూ లేక అనాథలుగా మా దగ్గరకు వచ్చారు. ఈ రోజు అందరూ ఉండి కూడా మేము అనాథలుగా మారాము. నా నిజమైన కన్నబిడ్డవు నువ్వే తల్లి అంటూ గట్టిగా కౌగిలించుకుని కన్నీటి పర్యంతం అయ్యారు భార్యాభర్తలు. ❖



# రుచుల వెంట పడకండి

- నసీరా బేగం

మనిషి బ్రతికి బట్టకట్టాలంటే ఆహారం తప్పనిసరిగా తీసుకోవాలి. మనం ఏం తినాలి? ఏం తినకూడదు? అనే విషయాలను మాత్రం ఇస్లామ్ ధర్మం దిశా నిర్దేశనం చేస్తుంది. పౌష్టికాహారాన్ని తీసుకుని శారీరకంగాను, మానసికంగానూ దృఢంగా ఉండాలని కోరుతుంది. నిషేధించిన పదార్థాలను తినకూడదని ఖుర్‌ఆన్ హెచ్చరిస్తుంది. వాటివల్ల ఆరోగ్యానికి నష్టాలే తప్ప ఎలాంటి ఆరోగ్య ప్రయోజనమూ ఉండదు. అయితే తినే విషయంలోనూ ఓ పద్ధతి పాటించాలన్నది ప్రవక్త బోధన. పరిశుద్ధమైన ఆహారాన్ని కూడా అవసరానికి మించి తీసుకుంటే హృదయం మృదుత్వాన్ని కోల్పోతుంది. దైవప్రవక్త(స)ఇలా సెలవిచ్చారు: అవసరానికి మించి తిని హృదయాన్ని నిర్జీవం చెయ్యకండి. అతిగా కురిసే వర్షాలు పంటను ఏవిధంగా నాశనం చేస్తాయో అతిగా తినే ఆహారమూ ఆరోగ్యాన్ని పాడుచేస్తాయి. అవయవాలలో కల్లోలం చెలరేగుతుంది. అధిక కొవ్వు పేరుకుంటుంది. దానివల్ల రక్తప్రసరణ సజావుగా సాగదు. గుండె జబ్బులు దాడి చేస్తాయి. అబూ జాఫర్(ర) ఇలా సెలవిచ్చారు: 'కడుపు ఖాళీగా ఉన్నప్పుడు మనిషి అవయవాలన్నీ ప్రశాంతంగా ఉంటాయి. ఎలాంటి కోరికలు వాటిలో జనించవు. కడుపు నిండినప్పుడు మనిషి అవయవాలన్నీ శక్తిని కూడగట్టుకుంటాయి. కోరికలు తీర్చుకుంటాయి.' అతిగా తినడం వల్ల చెడుకోరికలూ జనిస్తాయి. కడుపు భారంగా ఉండటం వల్ల నిలబడాలన్నా, కుదురుగా కూర్చోవాలన్నా, నమాజు చేయాలన్నా ఇబ్బంది ఏర్పడుతుంది. నమాజులో మనస్సు లగ్నం కాదు. ఆరాధనల రుచిని ఆస్వాదించలేము. హజ్రత్ అబూ బక్ర్(ర) ఈ విషయాన్ని ఇలా తెలియజేశారు: నేను ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించిన తరువాత నుంచి ఏనాడూ కడుపు నిండా భుజించలేదు. ఆరాధనల రుచిని ఆస్వాదించాలని ఏనాడూ తృప్తిగా నీరు త్రాగలేదు. ఎందుకంటే, అల్లాహ్‌తో కలవాలనే కోరిక నెరవేర్చుకోవాలని.

మితిమీరి తినే కోరిక హలాల్, హరామ్‌ల గురించి ఆలోచించనివ్వదు. రకరకాల రుచులపైనే ధ్యాస ఉంటుంది. అవి ఎక్కడ నుంచి లభిస్తాయి, ఎలా లభిస్తాయి, ఎల్లప్పుడూ వాటిని ఎలా పొందుతూ ఉండాలి అనే ధ్యాస అతన్ని వెంటాడుతూ ఉంటుంది. విలువైన సమయాన్ని, డబ్బును వెచ్చిస్తాడు. మనం సమాజం రుచుల వెంటపడి, శుభ సందర్భాలలో ఒకరికి ఒకరు పోటీ పడుతూ ధనాన్ని, సమయాన్ని, శక్తిసామర్థ్యాలను వృధా చేసుకోవటాన్ని కళ్ళారా చూస్తూనే ఉన్నాము. దాని ప్రభావం మనిషి ఆరోగ్యంపై పడుతున్న విషయాన్ని మనం స్పష్టంగా గమనిస్తూనే ఉన్నాము.

దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: అనారోగ్యాలన్నింటికీ మూల కారణం అజీర్తి. ప్రతి అనారోగ్యానికి మూల చికిత్స తక్కువగా తినటం, కడుపును ఖాళీగా ఉంచటం. తినే విషయంలో మధ్యే మార్గాన్ని పాటించినట్లయితే ఆరోగ్యంగా ఉండవచ్చు. ఆ ఆరోగ్యం ద్వారా అతను చురుకుగా ఉండి తాను సాధించాలనుకునే లక్ష్యాన్ని చేరుకోగలుగుతాడు. ఇంకా తీరిక సమయం ఎక్కువగా లభిస్తుంది. దైవ కార్యాలు, దైవారాధనలు అధికంగా చేసి పరలోక స్థానాలను పెంచుకోగలుగుతాడు.

ఒకసారి హజ్రత్ ఉమర్(ర) గారికి దప్పిక అయింది. ఒక మనిషిని నీళ్ళు ఇవ్వమని కోరారు. అతను ఖర్జూరపు పానీయాన్ని తెచ్చి ఇచ్చాడు. ఆయన నీళ్ళు అనుకుని తాగబోయారు. తియ్యటి, చల్లటి పానీయం ఆయన గారి గొంతులో పడగానే ఆయన ఉలిక్కిపడ్డారు. అతను, 'ఓ అమీరుల్ మోమినీన్! నేను మీ కోసం ప్రత్యేకంగా, రుచిగా చేశాను' అన్నాడు. ఆయన 'ఈ అధిక రుచియే నన్ను ఆపివేసింది' అన్నారు. ఒకవేళ మాకు కూడా పరలోక జీవితం గురించి భయం లేకపోతే మేము కూడా ఇహలోకపు రుచులలో, భోగభాగ్యాలలోనే నిమగ్నులై పోయేవారము. అంటే, దాని అర్థం మనిషి ఇహలోకపు రుచులలో పడి పరలోకాన్ని విస్మరించకూడదు. ❖



- తస్నీంజహాన్ ఖాన్

# యువశక్తి నిర్వీర్యం

దేశానికి, జాతికి వెన్నుముకలైన యువత తన బాధ్యతను మరచి ప్రవర్తిస్తోంది. చదువులో రాణించాల్సిన సమయంలో చదువును నిర్లక్ష్యం చేస్తూ సినిమాలు, షికార్లు, మొబైల్ ఫోన్‌తో ఆటల్లో తమ విలువైన సమయాన్ని వృథా చేస్తుంది. పరిపూర్ణ ఆరోగ్యాన్ని, శరీర దారుఢ్యాన్ని, అధిక శక్తిని కలిగి ఉండాల్సిన ఈ వయసులో వ్యసనాలకు బానిసై శరీరాన్ని బలహీనపర్చుకుంటుంది. మద్యం, మత్తు పదార్థాలకు బానిసలుగా మారి మానసిక వైకల్యాలకు గురవుతోంది. అక్రమార్జనకై అక్రమదారులు తొక్కి చివరకు జైలుపాలవుతున్నారు.

కొండంత ఆశలు, మహోన్నత ఆశయాలతో బంగారు కలలుగన్న తల్లిదండ్రులకు మనోవేదనను మిగులుస్తున్నారు. మంచి గుణగణాలు, నైతిక విలువలు, మంచి ప్రవర్తనతో ఉన్నత స్థానాలను అధిరోహిస్తున్నవారు చాలా చాలా తక్కువ మందే ఉంటున్నారు. టెక్నాలజీని సమాజాభివృద్ధికి ఉపయోగించాల్సిన యువత నకిలీ సర్టిఫికేట్లు తయారు చేయడానికి, ఇతరుల డేటా చోరీ చేయడానికి, అకౌంట్లు హ్యాక్ చేయడానికి, అశ్లీల చిత్రాలు తయారు చేయడానికి, బ్లాక్ మెయిలింగ్‌లకు పాల్పడుతున్నారు. రౌడీయిజం, కిడ్నాపింగ్, మానభంగాల్లో యువత పాత్ర అత్యధికంగా ఉంటుంది.

వివాహం చేసుకుని ఒక ఇంటివారై కుటుంబాన్ని ఏర్పర్చుకుని సమాజంలో నీతిగా, హుందాగా ఉండాల్సిన యువత వివాహాన్ని వెక్కిరిస్తూ అడ్డదారులు తొక్కుతుంది. అక్రమ సంబంధాలు నెలకొల్పుతుంది. దీనికి సహజీవనం (లివింగ్ టుగెదర్) అనే ట్యాగ్ ఒకటి తగిలిస్తుంది. అసహజ ఆకర్షణలకు గురై ఒకే జెండర్ వివాహాలు ఎక్కువైపోయాయి. లింగమార్పిడిలు ఎక్కువైపోయాయి. ఇవన్నీ మానవ భవిష్యత్తును ప్రశ్నిస్తున్నాయి. కుటుంబ వ్యవస్థతో సుందరంగా వ్యవస్థీకృతమై ఉన్న సమాజాన్ని కలుషితం చేసి కుళ్ళబెడుతున్నాయి. ఈ విచ్చలవిడితనం వల్ల సమాజానికి మనశ్శాంతి లేకుండాపోయింది. యువత చేసుకునే ఆత్మహత్యల్లో సగానికి పైగా అక్రమ సంబంధాల వల్లనే సంభవిస్తున్నాయి. సమాజంలో జరుగుతున్న హత్యలకు చాలావరకు ఈ అసాంఘిక, అక్రమ, అసహజ సంబంధాలే కారణమవుతున్నాయి.

## యవ్వనం ఎలా గడపాలి?

బాల్యంలో అప్పటివరకు ఎంత నిర్లక్ష్యంగా ఆటపాటలతో గడిపేసినా దానికి లెక్క ఉండదు. కానీ యవ్వనం గురించి గట్టిగా లెక్క తీసుకోవడం జరుగుతుంది. ప్రళయదినాన దైవం అడిగే ప్రశ్నలను గురించి తెలుపుతూ దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: "ప్రతి మనిషి ఐదు విషయాల గురించి ప్రశ్నించనంతవరకు అతని పాదాలు కదలజాలవు"

1) జీవితం ఏ పనిలో గడిచింది? 2) యవ్వన శక్తిసామర్థ్యాలు ఏ పనిలో వినియోగమయ్యాయి? 3) ధనం ఎక్కడినుండి సంపాదించావు? 4) ఎక్కడ ఖర్చు పెట్టావు? 5) ఆర్జించిన జ్ఞానాన్ని ఎంతవరకు ఆచరణలో పెట్టావు?

పై ఐదు ప్రశ్నలకూ జవాబులు యవ్వనంలోనే సిద్ధం చేసుకోవాలి. కొందరు గొప్ప గొప్ప చదువులు చదువుతారు గానీ దాన్ని సద్వినియోగపరచరు. ధర్మజ్ఞానార్జన చేసి కూడా దాన్ని ఆచరణలో పెట్టకుండా నిర్లక్ష్యం వహిస్తుంటారు. నేటి యువతకు పరలోక ఫలితాల చింతనయే లేకుండా పోయింది. ఎప్పుడో ముసలి తనంలో ఆరాధనలు చేద్దాం, తౌబా చేద్దాం. ఇప్పుడున్న జీవితాన్ని ఇష్టం వచ్చినట్లు ఎంజాయ్ చేద్దాం అని భావిస్తున్నారు. ప్రళయ దినాన అడిగే ఐదు ప్రశ్నల్లో నాలుగు ప్రశ్నలు యవ్వనానికి సంబంధించినవే ఉన్నాయి. జ్ఞానార్జన కేవలం ధనార్జన, ఉద్యోగార్జన కోసమే కాదని తెలుసుకోలేకపోతున్నారు. ఆరాధనలు అంటే ముసలి తనంలో చేయాల్సిన పనులు అని భావిస్తున్నారు. యవ్వనంలో చేసే ఆరాధనలకు ముసలితనంలో బలహీన స్థితిలో చేసే ఆరాధనల కంటే 70 రెట్లు అధిక పుణ్యం లభిస్తుంది అనే విషయం నేటి యువత విస్మరిస్తుంది. ఎవరియవ్వనమైతే దైవాభీష్టానికి అనుగుణంగా గడుస్తుందో వాడే అదృష్టవంతుడు. తన శక్తి సామర్థ్యాలను సమాజ శ్రేయస్సుకై వినియోగిస్తూ, ఉత్తమ నైతికత కలిగి, ధర్మసమ్మత ధనార్జన, ఆ ధనాన్ని సక్రమంగా ఖర్చు చేస్తూ చెడుగుల నుండి తనను తాను కాపాడుకుంటూ తనపై గల విధులను నిర్వర్తించేవాడే ఈ అమూల్య యవ్వనాన్ని సద్వినియోగించుకున్నట్లు! ❖




## యూపీ ప్రభుత్వంపై మండిపడుతూ 104 మంది విశ్రాంత ఐఏఎస్‌ల లేఖ

ఉత్తరప్రదేశ్ ద్వేషపూరిత రాజకీయాలకు కేంద్రంగా మారిందని 104 మంది రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. యూపీ ప్రభుత్వం జారీ చేసిన వివాదాస్పద మత మార్పిళ్ల వ్యతిరేక ఆర్డినెన్స్ రాష్ట్రాన్ని 'ద్వేషపూరిత విభజన, మూర్ఖత్వ రాజకీయాలకు కేంద్రంగా మార్చేసింది' అని పేర్కొన్నారు. ఈ మేరకు వారు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు లేఖ రాశారు. మాజీ జాతీయ సలహాదారు శివశంకర్ మీనన్, విదేశాంగశాఖ మాజీ కార్యదర్శి నిరుపమారావు, ప్రధానికి మాజీ సలహాదారు టీకేఏ నాయర్ తదితరులు ఆ లేఖపై సంతకాలు చేశారు. 'చట్ట విరుద్ధ ఆర్డినెన్స్'ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 'రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రమాణం చేశారు. కనుక మీరంతా రాజ్యాంగం పట్ల మీ వైఖరిని మార్చుకోవాల్సిన అవసరం ఉంది' అంటూ ముఖ్యమంత్రి సహా రాజకీయ నేతలందరినీ కోరారు. గంగా జమున నాగరికతకు కేంద్రమైన ఉత్తరప్రదేశ్ 'ద్వేషపూరిత విభజన, మూర్ఖత్వ రాజకీయాలకు కేంద్రంగా మార్చేసింది. పాలనా వ్యవస్థలను మతపరంగా విషపూరితం చేస్తున్నారు' అని ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. 'యువతపై మీ అధికార యంత్రాంగం హేయమైన అకృత్యాలకు పాల్పడింది. సాధారణ పౌరులుగా స్వేచ్ఛా జీవనం సాగించాలని భారతీయులు కోరుతున్నారు' అని ఆ లేఖ వ్యాఖ్యానించింది. మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని పలు దఫాలు దాడులు జరిగాయని తెలిపింది.

## బీజేపీ పాలిత రాష్ట్రాలు రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్నాయి

లవ్ జిహాద్‌ని అరికట్టేందుకు యూపీ, మధ్యప్రదేశ్ లాంటి రాష్ట్రాలు చట్టాలు చేయడాన్ని ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ తప్పుపట్టారు. దేశంలో బీజేపీ పాలిత రాష్ట్రాలు మాత్రమే ఈ చట్టాలను రూపొందిస్తున్నట్లు ఆయన ఆరోపించారు. రాజ్యాంగంలో ఎక్కడా లవ్ జిహాద్‌కు సంబంధించిన నిర్వచనం లేదన్నారు. ఈ చట్టాలతో బీజేపీ పాలిత రాష్ట్రాలు రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్నాయని విమర్శించారు. ఒకవేళ బీజేపీ పాలిత రాష్ట్రాలు ఏవైనా చట్టాలు చేయాలనుకుంటే, ఆ రాష్ట్రాలు కనీస మద్దతు ధరపై లేదా ఉద్యోగ కల్పనపై చట్టాలు చేయాలని కోరారు. భారతీయ రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, 14, 25 ప్రకారం.. దేశ పౌరుడి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలించలేమని గతంలో కోర్టులు పేర్కొన్నట్లు అసద్ గుర్తు చేశారు. రాజ్యాంగం కల్పించే ప్రాథమిక హక్కులను బీజేపీ ఉల్లంఘిస్తున్నట్లు ఆయన ఆరోపించారు.

## మతమార్పిడి వ్యతిరేక ఆర్డినెన్స్ చట్టవిరుద్ధం

యూపీ ప్రభుత్వం రూపొందించిన మతమార్పిడి వ్యతిరేక ఆర్డినెన్స్ చట్టవిరుద్ధమని జమాఅతె ఇస్లామీ హింద్ వెల్లడించింది. దీని ద్వారా సమాజాన్ని విభజిస్తున్నారని, ఒక ప్రత్యేక వర్గం వారిని లక్ష్యంగా చేసుకుంటున్నారని జమాఅతె ఇస్లామీ హింద్ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ సలీమ్ ఇంజనీర్ డిల్లీలో నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ పైవిధంగా స్పందించారు. రైతుల నిరసనలు, బాబరీ మస్జిద్, దేశంలో పెరుగుతున్న అవినీతి లాంటి వ్యవహారాలను పట్టించుకోవాలన్నారు.

## ఉత్తరాఖండ్ యువతుల ఉత్తమ ప్రతిభ



ఉత్తరాఖండ్‌కు చెందిన ముగ్గురు ముస్లిమ్ యువతులు జుడీషియల్ సర్వీస్ సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి న్యాయమూర్తులుగా ఎంపికయ్యారు. ఉత్తరాఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన ఫలితాల్లో 17 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. వీరిలో జహా ఆరా అన్సారీ, గులిస్తాన్ అంజుమ్, ఆయిషా ఫర్హీన్‌లు కూడా ఉన్నారు. గులిస్తాన్ అంజుమ్ తండ్రి హాజీ హుసైన్ అహ్మద్ సమాజ్‌వాదీ పార్టీ నేత. ఈమె పీజీ చేసిన తరువాత ఎల్‌ఎల్‌ఎం చేశారు. 2017లో పీసీఎస్‌జే పరీక్ష రాశారు. అప్పుడు ఆమెకు తక్కువ మార్కులొచ్చాయి. రెండోసారి పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించారు. గులిస్తాన్ తండ్రి రైతు. జహాఆరా అన్సారీ తండ్రి కూడా రైతే. జహా ఆరా మొదట జర్నలిస్ట్ కావాలనుకున్నారు. అందుకోసం ఆమె మాస్ కమ్యూనికేషన్ విద్యనభ్యసించారు. ఆ తరువాత న్యాయవాది కావాలనుకున్నారు. దాంతో ఎల్‌ఎల్‌బీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్యనభ్యసించారు. కాలేజ్ విద్య కూడా ప్రభుత్వ కళాశాలలోనే సాగింది. ఆయిషా ఫర్హీన్ అలీగఢ్ ముస్లిమ్ యూనివర్సిటీ నుంచి న్యాయవాద డిగ్రీని పొందారు. ముగ్గురు యువతులూ ఉత్తరా ఖండ్‌లోని హరిద్వార ప్రాంతానికి చెందినవారే. గతంలో ఉత్తరప్రదేశ్ జ్యుడీషియల్ సర్వీస్ ఫలితాల్లో 18 మంది, రాజస్థాన్ జుడీషియల్ సర్వీస్‌లో ఐదుగురు ముస్లిమ్ యువతులు న్యాయ మూర్తులయ్యారు.




## హజ్జ్ యాత్రికులకు డిజిటల్ కార్డులు



ఈ యేడు హజ్ యాత్రికులకు పటిష్ట మైన సేవలు అందించడానికి డిజిటల్ కార్డులు రూపొందించే కార్యక్రమానికి ఆమోదం లభించిందని సౌదీ అరేబియా హజ్జ్ ఉమ్రా శాఖ వెల్లడించింది. ఈ డిజిటల్ కార్డుల ద్వారా హజ్జ్ యాత్రికుల పూర్తి సమాచారం అందుబాటులో ఉంటుందని తెలిపింది. ఈ కార్డులు ఎన్ఎఫ్‌సీ వ్యవస్థతో పనిచేస్తాయి. వీటిని స్కాన్ చేయడంతో యాత్రికుల వివరాలు తెలుసుకోవచ్చు. గత సంవత్సరం కూడా దీనిని ఉపయోగించామని కాని 50 వేల మంది యాత్రికులపైనే దీనిని ప్రయోగించామని ఈ సారి అందరికీ ఈ కార్డులు జారీ చేస్తామని పేర్కొంది. కొత్త కార్డులో ఉండే బార్ కోడ్ ద్వారా హాజీల వివరాలు, వారి దేశం, రాకపోకల వివరాలు, పవిత్ర స్థలాలలో వారి నివాస ఏర్పాట్లు, హజ్ పర్మిట్ తదితర వివరాలన్నీ అందులో ఉంటాయని తెలిపింది. అనధికారికంగా ఎవరయినా హజ్ కోసం వస్తే ఈ కార్డు ద్వారా సులువుగా తెలుసుకోవచ్చని చెప్పింది.

## ఇస్రాయీల్‌తో సంబంధాలకు ఒకే కాని ఫలస్తీనా పట్ల దాని వైఖరి సరికాదు

ఇస్రాయిల్ దేశంతో మంచి సంబంధాలు ఏర్పరచుకోవడానికి తాము సిద్ధమేనని కాని ఫలస్తీనా పట్ల ఆ దేశ వైఖరి మాత్రం ఆమోద యోగ్యం కాదని టర్కీ అధ్యక్షుడు రజబ్ తయ్యిబ్ ఎర్దొగాన్ వెల్లడించారు. రైటర్జ్ పత్రిక ప్రకారం ఇరు దేశాల ఇంటలిజెన్స్ సంస్థల మధ్య చర్చలు మొదలయ్యాయని ఎర్దొగాన్ తెలిపారు. ఇస్తాంబుల్‌లో ఆయన పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ.... ఇస్రాయీల్‌లో ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులతోనే సమస్యలు. ఈ సమస్యలు లేకపోతే ఇరు దేశాల సంబంధాలు వేరే రకంగా ఉంటాయని చెప్పారు. అయితే ఫలస్తీనా పట్ల తమ వైఖరి అందరికీ తెలిసిందే. ఫలస్తీనా పట్ల ఇస్రాయీల్ వ్యవహరిస్తున్న తీరు ఎన్నటికీ టర్కీకి ఆమోద యోగ్యం కాదు. వారి దౌర్జన్యపూరిత వైఖరిని తాము అంగీకరించము అని పేర్కొన్నారు.

## బహ్రాయిన్‌తో పటిష్ట సంబంధాలు

బహ్రాయిన్‌తో తమ సంబంధాలు చాలా పటిష్టంగా, సూక్ష్మంగా ఉన్నాయని సౌదీ యువరాజు ముహమ్మద్ బిన్ సల్మాన్ వెల్లడించారు. ఇరుదేశాల మధ్య ఈ సంబంధాలు చాలా పురాతనమైనవన్నారు. ఆన్‌లైన్ ద్వారా జరిగిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరు దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక, రక్షణ, సైనిక, పెట్టుబడీదారి, అభివృద్ధి, సాంస్కృతిక రంగాలతో పాటు అనేక రంగాల్లో సంబంధాలను ముందుకు సాగించాలనుకుంటున్నామని పేర్కొన్నారు. ఇరు దేశాలకు ఎదురవుతున్న సవాళ్ళను ఎదుర్కోడానికి, ఉమ్మడి ప్రయోజనాల కోసం ఇరు దేశాలు కలసి పని చేస్తాయన్నారు. ఈ సందర్భంగా బహ్రైన్ పాలకుని ప్రయత్నాలను ప్రశంసించారు.

## వైట్ హౌస్ డిజిటల్ స్ట్రాటజీ మేనేజర్‌గా మరో భారతీయురాలు

అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన జోబిడెన్ వైట్ హౌస్ ఆఫీస్ ఆఫ్ డిజిటల్ స్ట్రాటజీ భాగస్వామ్య మేనేజర్‌గా మరో భారతీయురాలిని నియమించారు. కశ్మీర్‌లో జన్మించిన ఆయిషా షాను ఈ పదవికి ఎంపికచేశారు. డిజిటల్ స్ట్రాటజీ డైరెక్టర్‌గా రూబ్ ఫ్లార్టీ నేతృత్వం వహించనున్నట్లు బైడెన్ ట్రాన్సిషన్ బృందం ఒక ప్రకటనలో తెలిపింది. లూసియానాలో పెరిగిన ఆయిషా గతంలో బిడెన్-హారిస్ ప్రచారంలో డిజిటల్ భాగస్వామ్య నిర్వాకురాలిగా పనిచేశారు. ఈ టీమ్ అమెరికా వాసులకు వైట్ హౌస్‌తో బంధాన్ని పటిష్ట పరిచే పనులు చేస్తుంది.

## గల్ఫ్ దేశాల్లో వ్యాక్సినేషన్ ప్రక్రియ షురూ

గల్ఫ్ దేశాల్లో కరోనా కట్టడికి వ్యాక్సినేషన్ ప్రక్రియ మొదలైంది. అక్కడి పౌరులకు, ప్రవాసులకు అందరికీ ఉచితంగా వ్యాక్సిన్ ఇస్తున్నారు. ఒమాన్‌తో పాటు మొత్తం ఆరు గల్ఫ్ దేశాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. మొదటగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో, ఆ తర్వాత బహ్రెయిన్, సౌదీ అరేబియా, కువైట్, ఖతర్‌ల్లో మొదలుపెట్టారు. కొద్ది రోజుల తేడాతో రెండు డోసులుగా ఈ వ్యాక్సిన్‌ను అందచేస్తున్నారు. యుఎఇ, బహ్రెయిన్‌ల్లో సైనొఫామ్, ఫైజర్ వ్యాక్సిన్లు వాడుతున్నారు. ఇతర దేశాల్లో ఫైజర్ వ్యాక్సిన్ అందుబాటులో వుంది. ముందుగా వృద్ధులకు, ఆరోగ్య సిబ్బందికి, దీర్ఘకాలంగా తీవ్ర జబ్బులతో బాధపడుతున్న వారికి ప్రాధాన్యత ఇస్తున్నారు. బహ్రెయిన్‌లో ముందుగా వ్యాక్సిన్ కోసం రిజిస్టర్ చేసుకోవాలి. 18 ఏళ్లు పైబడిన 15 లక్షల మందికి వ్యాక్సిన్ అందచేస్తున్నారు. సౌదీ యువరాజు ముహ్మద్ బిన్ సల్మాన్ వ్యాక్సిన్ వేయించుకున్నారు.

# ఖుర్ఆన్‌లోని ఒక్క ఆయత్ (వాక్యం)పై పరవశించిపోయిన సైంటిస్ట్ (డాక్టర్)

**- అబుల్ ఫౌజాన్**

విషయ పరిజ్ఞానం, బాధ మొదలగువాటి సంబంధం కేవలం మస్తిష్కంతో మాత్రమే ఉంటుందని ఇంతకు ముందు సాధారణంగా భావించబడుతూ ఉండేది. అయితే ఇటీవలి కాలంలోనే (ఈ మధ్యనే) చర్మంలో బాధను గ్రహించే కారకాలు (Receptors) ఉంటాయని తెలిసివచ్చింది. ఒకవేళ ఈ కణాలే లేకపోయినట్లయితే మనిషిలో బాధను గ్రహించే యోగ్యతే ఉండదు.

కాలిపోయిన (అగ్ని ప్రమాదానికి గురిఅయిన) ఒక పేషంట్‌ను తీసుకొచ్చినప్పుడు డాక్టర్ ఆ కాలిన దాని తీవ్రతను (స్థాయిని) అంచనా వేయడానికి పేషంట్ గాయంపై (కాలినచోట) పిన్నుతో పొడిచి చూస్తాడు. ఒకవేళ పిన్ను గుచ్చినప్పుడు పేషంట్‌కు బాధ అనిపిస్తే డాక్టర్ సంతోషపడతాడు. ...అలా ఎందుకంటే దీని ద్వారా కాలిన గాయం కేవలం పై వరకే ఉందని, ఇంకా బాధను గ్రహించే కణాలు (కారకాలు - Receptors) సురక్షితంగా ఉన్నాయని దాని భావం. దీనికి భిన్నంగా గాయాలతో ప్రభావిత మైన వ్యక్తికి సూది గుచ్చినా బాధ అనిపించకపోతే అప్పుడది ప్రమాదకరంగా భావించబడుతుంది. దీని అర్థం ఏమిటంటే కాలిన కారణంగా ఏర్పడ్డ గాయం లోతు వరకు ఉందని, బాధను గ్రహించే కణాలు (కారకాలు- Receptors) సైతం చచ్చిపోయాయని తెలిసి పోతుంది.


> **"మా ఆయత్‌లను నిరాకరించిన వారిని మేము నిశ్చయంగా అగ్నిలో పడవేస్తాము. ఇంకా వారి శరీర చర్మం కాలి కరిగి పోయినప్పుడల్లా దాని స్థానంలో మేము మరొక చర్మాన్ని సృష్టిస్తాము, వారు శిక్షను బాగా రుచి చూడాలని. అల్లాహ్ సర్వ శక్తిమంతుడు, తన నిర్ణయాలను అమలుపరచే విజ్ఞత ఆయనకు నిండుగా ఉంది."** *(అన్ నిసా : 56)*

థాయిలాండ్‌లోని చ్యాంగ్‌మాయి యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అనాటమి అధిపతి ... ప్రొఫెసర్ తేజాతత్ తేజాసెన్ బాధను గ్రహించే కణాల (కారకాలు - Receptors) పరిశోధనపై ఓ సుదీర్ఘకాలం వెచ్చించారు. ఈ విషయమై ఆయన ఇలా అన్నారు: "గత మూడు సంవత్సరాల నుండి నేను ఖుర్ఆన్ పట్ల ఆసక్తి పెంచుకున్నాను. నా అధ్యయనం ద్వారానూ, ఈ సమావేశం (సవూది మెడికల్ కాన్ఫరెన్స్-8) ద్వారానూ 1400 సంవత్సరాల క్రితం ఖుర్ఆన్‌లో తెలియపర్చబడిన విషయాలన్నీ నిజాలని సైన్స్‌పరంగా రుజువు కాబడ్డాయని తెలుసుకున్నాను. ముహమ్మద్ ప్రవక్త(స) నిరక్షరాస్యులు కనుక ఇది ఖచ్చితంగా దైవ సందేశమే అయి ఉంటుంది. ముహమ్మద్(స) నిశ్చయంగా సత్యవంతుడైన దైవ సందేశహరులు అనేది నా నిశ్చితాభిప్రాయం.

"ముహమ్మద్ తనకు లభించిన జ్ఞాన జ్యోతిని మనకు అందించారు. సృష్టికర్త అయిన దేవుడు మాత్రమే ఈ వైజ్ఞానిక అంశాలను అందించి ఉంటాడు. ఈ సృష్టికర్తయే దేవుడు, కనుక ఈ విషయం చెప్పటానికి, ఒప్పుకోవటానికి ఇదే తగిన సమయం. ఆరాధనకు అర్హుడు కేవలం ఆ సృష్టికర్త అయిన దేవుడు (అల్లాహ్) మాత్రమే. ఈ ముహమ్మద్ (స) ఆ సృష్టికర్త అయిన దేవుని ప్రవక్త. ... ఈ సమావేశానికి హాజరైనందువల్ల నేను పొందిన అతి విలువైన విషయం 'లా ఇలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదుర్ రసూలుల్లాహ్' అనే సద్వచనాన్ని పలకడం ద్వారా నేను 'ముస్లిం'గా (దైవ విధేయునిగా) మారిపోవటమే.

*('ఎంత అద్భుతం ఈ ఖుర్ఆన్' పుస్తకం నుంచి)*

**తుది గీటు**



Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**